

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 14 నవంబరు 2024 | 5





నేత్రపర్వంగా సత్యదేవుని నౌకా విహారం ...7లో



ఇది మన మంచి ప్రభుత్వం అంటున్నారు

బుధవారం అసెంబ్లీ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

గత ఐదేళ్లలో అరాచకాలు, విధ్వంసాలతో విసుగు చెందిన ప్రజలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇది మంచి ప్రభుత్వం అని ధైర్యంగా ఉన్నారు. అపార అనుభవజ్ఞుడైన చంద్రబాబు పాలనతో రాష్ట్రం ఇప్పుడు వికాసం వైపు అడుగులు వేస్తోంది. జగన్‌కు సంపద సృష్టించడం చేతకాక అంకెల గారడీ చేశాడు. డ్రగ్స్‌కు కేంద్ర బిందువుగా రాష్ట్రాన్ని మార్చేశాడని, యువత భవిష్యత్తుతో ఆడుకున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజలు సంతోషపడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లాను పర్యాటకపరంగా పూర్తిగా అభివృద్ధి చేయాలి.

- రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)



కొవ్వూరు ఏరియా ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసి సౌకర్యాలు కల్పించాలి

బుధవారం అసెంబ్లీ సమావేశంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి పూర్తిస్థాయి వైద్య సౌకర్యాలు కల్పించాలి. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గాల ప్రజలకు ఈ ఆసుపత్రి అందుబాటులో ఉంది. కొవిడ్ కేంద్రంగా పెట్టినప్పటికీ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. స్థానిక పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో కొంత వరకు వైద్యం అందిస్తున్నాము. పేరుకు ఏరియా ఆసుపత్రే అయినా వైద్యులు, సిబ్బంది, ల్యాబ్, లాబ్ టెక్నీషియన్ లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వాన్ని కోరగా ప్రతిపాదనలు పూర్తయ్యేసరికి ప్రభుత్వం మారింది. గత వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది.

- కొవ్వూరు (ఆంధ్రజ్యోతి)

- ఆవేదనలో విద్యా హక్కు చట్టం
- వెంటాడుతున్న ఆర్థిక దుస్థితి
- గత ప్రభుత్వంలో బడులు గజిబిజి
- జిల్లాలో 8వేల మంది చదువుకు దూరం
- ఒక్కరూ లేరంటున్న యంత్రాంగం



మగ్గుతున్న బాల్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బడిలో విద్యాబుద్ధులు నేర్వాల్సిన బాల్యం.. బడి బయట మగ్గిపోతోంది. రేపటి పౌరులు బలపానికి దూరమై వివిధ పనుల్లో బతుకీడుస్తున్నారు. ఈ పరిస్థితులు చూస్తూ బాలల హక్కులు, విద్యా హక్కు చట్టం ఆవేదన చెందుతోంది. విద్యా హక్కు చట్ట ప్రకారం 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు బడిలోనే ఉండాలి. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఇంట్లో ఆర్థిక పరిస్థితుల వల్ల పనులకు వెళ్లడం, బుద్ధి మాంద్యం కలిగిన పిల్లలకు సరైన బోధనా ఏర్పాట్లు లేకపోవడం, పొట్ట చేత పట్టుకుని వలసలు వెళ్తున్న తల్లిదండ్రుల వెంట పిల్లలు దారితీయడం వంటి వివిధ కారణాలు బాలల విద్యపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తూ దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా పరిణమించాయి. నేటి బాలలు రేపటి పౌరులనే నెహ్రూ మాటలు చిన్నబోయి నేటి పిల్లలు రేపటి పనోళ్లు అనే విధంగా పరిస్థితులు పరిణమించాయి. అయితే జిల్లాలో బడి బయట ఒక్కరూ లేరని అధికారులు చెప్తున్నారు. కానీ సిగ్నల్ పాయింట్లు తదితర చోట్ల పిల్లలతో పాటు మహిళ యాచిస్తూ కనిపిస్తూ ఉంటుంది. కానీ ఆ పిల్లలు యంత్రాంగానికి మాత్రం కనిపించరెందుకనో!

వైసీపీ ప్రభుత్వంలో విద్యా విధానాన్ని అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. తీరూతెన్నూ లేకుండా రోజుకో మార్పు, పూటకో కొత్త సిలబస్ అనే మాదిరిగా పాలన సాగించారు. పాఠశాలలను మెర్జ్ చేయడం దగ్గర నుంచి చాక్‌పీస్‌లకూ డబ్బులు లేకుండా చేశారు. ఎంతసేపూ ప్రచార యావతో కూడిన గలాటాలో బడి మానేస్తున్న పిల్లల గురించి పట్టించుకోలేదు. దీంతో బడికి దూరమైన పిల్లల సంఖ్య ఎక్కువైపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్యలను చూసి నివ్వెరపోయింది. జిల్లాల వారీగా డ్రాపవుట్స్ (చదువు మానేసిన) పిల్లల సంఖ్యపై కసరత్తు చేసింది. ఈ లిస్టులో తూర్పు గోదావరి 11వ స్థానంలో ఉంది. గత నెల 15న విడుదల చేసిన వివరాల ప్రకారం జిల్లాలో 8,103 మంది ఉన్నట్లు తేల్చారు. ఈ జాబితాను జిల్లాకు పంపించి వెంటనే చర్యలకు ఉపక్రమించారు. క్లస్టర్ స్థాయిలో సీఆర్పీలను బడికి రాకుండా ఉన్న పిల్లల ఇళ్లకు పంపించి ఆరా తీస్తున్నారు.

● ఆర్థిక దుస్థితితో 30 మంది

ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్కరు కూడా బడి బయట ఉండకూడదంటూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో.. బడికి రాకుండా ఉన్న పిల్లల విషయంలో కారణాలపై అన్వేషణ మొదలుపెట్టారు. ఆ కారణాల్లో ఆర్థిక పరిస్థితులు అనుకూలించక 30 మంది విద్యకు దూరమైనట్లు గుర్తించడం ఆందోళనకు గురిచేస్తోంది. ఇల్లు గడవడం ఇబ్బందిగా ఉండడంతో ఆ పిల్లలు కార్మికులుగా పని చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే 15 మంది పిల్లలు రవాణా ఇబ్బందుల వల్ల చదువుకు స్వస్తి చెప్పేశారు. ఈ నెల 5వ తేదీ వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం 32 మంది పాఠశాల విద్య పూర్తి లేదా మధ్యలో మానేశారు. 78 మంది చనిపోయారు. 1211 మందికి వివరాలు పలుమార్లు నమోదయ్యాయి. 122 మంది రాష్ట్రంలోని వేరే ప్రాంతాలకు, 143 మంది ఇతర రాష్ట్రాలకు, ఐదుగురు విదేశాలకు వెళ్లారు. ఇద్దరు అనాధ పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారు. ఇతర కారణాల వల్ల 372 మంది బడికి రావట్లేదు. 287 మంది చాలా రోజుల నుంచి హాజరు కావట్లేదు. డేటా ఎంట్రీలో తప్పిదాలు 852 జరిగాయని గుర్తించారు. మొత్తానికి ఇంకా 3,207 మంది పిల్లల వివరాలు తేలాల్సి ఉంది.

● గజిబిజి ఇదేనా!

గతంలో స్టూడెంట్ ఇన్ఫో అనే పోర్టల్‌లో ప్రభుత్వ/ప్రైవేటు విద్యార్థుల వివరాలు కచ్చితంగా నమోదు చేసేవాళ్లు. తర్వాత యూడైస్ ప్లస్ అని తీసుకొచ్చారు. ముందు పోర్టల్‌లోని వివరాలు ఈ పోర్టల్‌లోకి బదిలీ కావడంలో ఇబ్బందులు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. అందువల్ల డ్రాపవుట్ విండోలో ఎక్కువ మంది పిల్లలను చూపిస్తోందని అంటున్నారు. కాగా ప్రైవేటు పాఠశాలలు సామర్థ్యానికి మించి విద్యార్థులను చేర్పించుకుంటాయనే విషయం బహిరంగ రహస్యమే. ఈ క్రమంలో వాస్తవాలు బయట పడతాయనే కారణంతో విద్యార్థుల వివరాలను స్టూడెంట్ ఇన్ఫో/యూడైస్‌లో నమోదు చేయకుండా సొంతంగా పరీక్షలు పెట్టేస్తూ తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రైవేటుకు వెళ్తున్న విద్యార్థుల విషయంలో గందరగోళం ఏర్పడి డ్రాపవుట్స్ సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని చెప్తున్నారు.

● మండలాల వారీగా

ఈ నెల 5వ తేదీకి క్రోడీకరించిన వివరాల ప్రకారం మండలాల వారీగా బడికి దూరంగా ఉన్న పిల్లల సంఖ్యలను చూస్తే... గోపాలపురం 7, తాళ్లపూడి 76, పెరవలి 88, సీతానగరం 69, ఉండ్రాజవరం 124, అనపర్తి 158, గోకవరం 134, దేవరాపల్లి 138, బిక్కవోలు 146, నిడదవోలు 37, రంగంపేట 102, కొవ్వూరు 181, రాజానగరం 199, కడియం 223, చాగల్లు 92, నల్లజర్ల 117, కోరుకొండ 327, రాజమహేంద్రవరం అర్బన్ 538, రాజమహేంద్రవరం రూరల్‌లో 451 మంది పిల్లలు బడి బయట ఉన్నారని రాష్ట్ర స్థాయి నివేదిక చెప్తోంది. ఈ మండలాల్లో అర్బన్, రూరల్ పరిధిలోనే 989 మంది పిల్లల పరిస్థితి తెలియాల్సి ఉండడం గమనార్హం.

● 9 నెలల్లో 12 మాత్రమే

బాలల సంరక్షణ, రక్షణ కోసం చైల్డ్ లైన్ పని చేస్తోంది. దీనికి దేశవ్యాప్తంగా 1098 టోల్‌ఫ్రీ ఫోన్ నెంబరు ఉంది. అయితే తమకు ఏదైనా ఫిర్యాదు వస్తేనే స్పందిస్తామనే ధోరణిలో చైల్డ్‌లైన్ సిబ్బంది ఉన్నారు. గడిచిన 9 నెలల్లో 12 కాల్స్ మాత్రమే రాగా వాటిలో బాలలు ఇద్దరు ఉన్నారు. ఏదేమైనా బాలలు బడికి దూరం కావడానికి రకరకాల కారణాలు కనిపిస్తున్నాయి. వీటిపై సహేతుకమైన కసరత్తు జరిగితేనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

వీళ్లెవరు మరి?

బాల కార్మికుల కోసం కార్మిక శాఖ విస్తృతంగా తనిఖీలు చేస్తోంది. గత రెండేళ్లలో 107 ప్రత్యేక సోదాలు చేసి 54 మంది బాల కార్మికులను అధికారులు గుర్తించారు. వీళ్లందరూ చదువుకు దూరంగా ఉన్నవాళ్లే. ఆర్థిక దౌర్బల్యం వల్ల దుకాణాలు, హోటళ్లు వంటిచోట పనులు చేస్తున్నారు. వారిని పనిలో పెట్టుకున్న వారిపై 54 కేసులు నమోదు చేయగా కోర్టు జరిమానా విధించింది. బడి బయట పిల్లలు ఎవరూ లేరని యంత్రాంగం ఎప్పుడూ చెప్పే మాటే.. అయితే వాళ్లందరూ ఎవరనే ప్రశ్నకే సమాధానం దొరకట్లేదు.

కోరుకొండలో అంగరంగ వైభవంగా.. లక్ష్మీనరసింహుడి తెప్పోత్సవం

...7లో





వైసీపీకి బిగ్ షాక్



- లోకేశ్ సమక్షంలో నేడు టీడీపీలో చేరనున్న రాజీవ్ కృష్ణ
- ముగ్గురు జడ్పీటీసీలు, ఒక ఎంపీపీ, పలువురు నేతలు కూడా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, వైసీపీ మాజీ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. రెండు రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసిన రాజీవ్‌కృష్ణ గురువారం ఉదయం అమరావతిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఆయనతో పాటు ముగ్గురు జడ్పీటీసీలు, ఒక ఎంపీపీ, పలువురు నేతలు టీడీపీలో చేరనున్నారు. వీరంతా ఇప్పటికే రాజధాని చేరుకున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ జిల్లా నేతలు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒకప్పుడు టీడీపీలో కింగ్ మేకర్‌గా వ్యవహరించి... 2012లో వైసీపీలో చేరిన ప్రముఖ పారిశ్రామికవేత్త పెండ్యాల కృష్ణబాబు అల్లుడు రాజీవ్‌కృష్ణ అనే సంగతి అందరికీ తెలిసిందే. పెద్ద పారిశ్రామికవేత్త అయినప్పటికీ సామాన్య కార్యకర్తలతో కూడా కలసిమెలసి ఉండే స్వభావం ఆయనది. 2014లో నిడదవోలు నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. కొద్దిరోజుల ముందే అభ్యర్థిత్వం ఖరారు కావడంతో పాటు అప్పటి టీడీపీ గాలిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. తర్వాత 12ఏళ్లగా కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో పార్టీకి వెన్నుదన్నుగా నిలబడ్డారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ సలహాదారుగా, అధికార ప్రతినిధిగా కూడా వ్యవహరించారు. పార్టీ శ్రేణులు, ద్వితీయ స్థాయి నేతల ఒత్తిడితో రాజీవ్‌కృష్ణ టీడీపీలో చేరడానికి నిర్ణయం తీసుకున్నారు. లోకేశ్‌తో మంతనాలు జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆయన్ను పార్టీలో చేరాలని చేరడానికి ఆహ్వానించినట్టు సమాచారం. రాజీవ్ కృష్ణతో పాటు కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు జడ్పీటీసీలు బొంత వెంకటలక్ష్మి, గారపాటి విజయదుర్గాశ్రీనివాస్, కొయ్యా సూరిబాబు, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, తాళ్లపూడి సర్పంచ్ నక్కా చిట్టిబాబు, దొమ్మేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు గారపాటి కృష్ణ, ధర్మవరం మాజీ సొసైటీ అధ్యక్షుడు ముళ్లపూడి కాశీవిశ్వనాథం, పశివేదల మాజీ ఉప సర్పంచ్ యలమాటి సత్యనారాయణ, వైసీపీ నేతలు నల్లా కిశోర్, చంద్రవరం వైసీపీ నేత బండి అశోక్‌బాబు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి కూడా టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

తాళ్లపూడి జడ్పీటీసీ పోసిన శ్రీలేఖ జడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా వున్నారు. ఆమె పార్టీ మారకపోవచ్చు కానీ పలువురు జడ్పీటీసీలు టీడీపీలో చేరడంతో పాటు ఇటీవల కొందరు జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ చైర్మన్ పదవికి కూడా ఇబ్బంది కలిగే పరిస్థితి ఏర్పడింది. నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి కూడా త్వరలో కొంతమంది రాజీవ్‌కృష్ణకు మద్దతుగా టీడీపీలో చేరతారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. రాజకీయంగా పట్టున్న కుటుంబానికి చెందిన నేత కావడం వల్ల రాజీవ్‌కృష్ణ చేరికతో టీడీపీకి బలం మరింత పెరిగినట్టేనని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.



బోట్స్‌మన్ రీచ్‌లన్నీ రాంకీ, ఆర్‌కేలకే!

- వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పింది వాళ్లే
- నామమాత్రంగా రెవెన్యూ ఉద్యోగులు
- ఇసుక రీచ్ వద్ద ఐదు యూనిట్ల లారీ రూ.12వేలు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విని యోగదారులకు ఇసుక అందని ద్రాక్ష మాదిరిగా ఉంది. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రీచ్‌ల్లోనూ ఇదే పరిస్థితి వుంది. టన్ను ఇసుక ధర రూ.229గా ప్రభుత్వం నిర్ణయిస్తే దానికి చాలా చోట్ల తూట్లుపొడుస్తున్నారు. ఐదు యూనిట్ల ఇసుక రూ.4,580 కాగా రూ.12వేలకు విక్రయిస్తున్నారు. అంటే టన్ను ఇసుక రూ.600 వసూలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని గాయత్రి రీచ్ వద్ద ఒక డ్రైవర్ నేరుగా కలెక్టర్‌కు చెప్పినట్టు తెలిసింది. ధరను ఎంత నియంత్రించినా వినియోగదారుని వద్దకు వెళ్లేసరికి రెట్టింపవుతోంది. ఈ రోజుకి కూడా సాధారణ ప్రజలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుక అందట్లేదంటే మాఫియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలి.

రాజమహేంద్రవరం రూరల్, సిటీ పరిధిలోని రీచ్‌లను ఇద్దరు వ్యక్తులకు గుత్తగా అప్పగించేశారు. బోట్స్‌మన్ సొసైటీలు ఇసుక తవ్వితే ప్రభుత్వమే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేసేది. గత ప్రభుత్వం జేపీ సంస్థకు అప్పగించడంతో సదరు సిబ్బంది రేవుల్లో విధులు నిర్వర్తించి సొసైటీలకు టన్నుకు రూ.200 ఇచ్చేవారు. దానిపై టన్నుకు రూ.430 అదనంగా కలిపి లారీ డ్రైవర్‌కి రూ.630కి విక్రయించేవారు. దానిపై రవాణా చార్జీతో వినియోగదారులకు విక్రయించేవారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పెట్టింది. ప్రజలే నేరుగా టన్ను రూ.229కి కొనుగోలు చేసుకుని దానిపై ట్రాన్స్‌పోర్టు చార్జీ చెల్లించి ఇంటికి ఇసుక తీసుకెళ్లే వెసులుబాటు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం మంచిదే. కానీ ఇసుక వ్యవహారంలో మారుతున్న సమీకరణలు సొసైటీలకు నష్టం చేకూర్చేలా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జేపీ సంస్థ ఇసుక వ్యాపారం చేసినప్పుడు వైసీపీ పెద్దిరెడ్ల అనుచరులుగా, ఇన్‌చార్జిలుగా పనిచేసిన వారికే కొన్ని ర్యాంపులను కట్టబెట్టింది. వారే చక్రం తిప్పి వ్యాపారాలు చేశారు. వైసీపీ పెద్దలకు కోట్లాది రూపాయలు కూడబెట్టారు. అయితే ఇప్పుడు కూడా గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఆర్‌కే, రాంకీలకు అప్పగించి వారి ఆధీనంలో ఇసుక వ్యాపారం చెయ్యడం విమర్శలకు తావిస్తోంది. టన్ను ఇసుక రూ.229 అయితే అందులో ఈ వ్యక్తులు ఎంత తీసుకుంటారు. సొసైటీలకు ఎంత ఇస్తారు, అప్పుడు గిట్టుబాటు అవుతుందా, లేక పాత పద్ధతిలో బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక బోట్స్‌మన్ సొసైటీల ఇసుక రీచ్‌లను రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించలేక ప్రభుత్వాధికారులు చేతులెత్తేసారా అన్న అనుమానాలూ వున్నాయి.

ధవళేశ్వరంలోని గాయత్రి ఇసుక ర్యాంపును, వేమగిరి ఇసుక ర్యాంపును కలెక్టర్ ప్రశాంతి బుధవారం తనిఖీ చేశారు. అదనపు వసూళ్లపై ఆమెకు కొంతమంది లారీ డ్రైవర్లు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదులను రికార్డు చేయాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక సరఫరా అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. ఇసుక లోడింగ్ ఖర్చులను కూడా వినియోగదారులే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో హేతుబద్ధత కలిగి ఖర్చుల నిమిత్తం చెల్లింపులు జరపాలని సూచించారు. ఖర్చుల విషయంలో ఇష్టానుసారం నిర్ణయించరాదని స్పష్టం చేశారు.

పేదల గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై

ప్రత్యేక దృష్టి

వెలుగుబందలో గృహ నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి



రాజానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ గృహ నిర్మాణ పనులకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. రాజానగరం మండలం వెలుగుబంద కాలనీని ఆమె బుధవారం సందర్శించారు. సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో హౌసింగ్ నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, స్థితిగతులపై సమన్వయ శాఖాధికారులు, క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హౌసింగ్ కాలనీల్లో విద్యుత్, తాగునీటి సరఫరా, చెత్త సేకరణపై కార్యాచరణ అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హౌసింగ్ లే-అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో విద్యుత్ లైన్లు, రహదారుల అభివృద్ధి, తాగునీరు, అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ తదితర సదుపాయాలు కల్పించడం కోసం మూడు అంశాల ప్రాతిపదికన పనులు పూర్తి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గతంలో ప్రతిపాదించిన పనులను పూర్తి చేసేలా చర్యలతో పాటుగా కొత్తగా గుర్తించిన పనులకు ప్రతిపాదనలు పంపించడం, మైనర్ పనులను సంబంధించి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. గతంలో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి వాటిని శాశ్వత కనెక్షన్‌గా మార్పు చేయాలని, విద్యుత్ లైన్లు క్రమబద్ధీకరించాలన్నారు. లే-అవుట్‌లో మరిన్ని ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, గ్రామ పంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న దృష్ట్యా పట్టణానికి చెందిన వారికి ఇళ్లు కేటాయించిన ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం, ఇతర నిర్వహణ విషయాల్లో చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ కేఎల్ శివజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బీవీ గిరి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ టి.తిలక్‌కుమార్, ఇన్‌చార్జి డీపీవో ఎం.నాగలత, గృహ నిర్మాణ సంస్థ క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.



భళా.. బాల'

6వ పేజీలో...

» నేడు బాలల దినోత్సవం సందర్భంగా..



బుడిబుడి అడుగుల బుజ్జాయిలు
బడిలోనే కాదు ఆటల గడిలో కూడా
చిచ్చర పిడుగులు అవుతున్నారు..

కొంతమంది అయితే
పలకాబలపం వయసు నుంచే
పతకాలపై కన్నేస్తున్నారు..

యోగాలో బాగా
రాణిస్తున్న వారూ ఉన్నారు..
వెయిట్ లిఫ్టింగ్‌లో 'కప్పుల' బరువులు
మోస్తున్న వారూ ఉన్నారు..

కొందరైతే చూడ్డానికి 'సాఫ్ట్'గా
కనిపిస్తారు కానీ
సాఫ్ట్‌బాల్ ఫీల్డ్‌లోకి దిగితే
షీల్డ్ గ్యారంటీ..

చిట్టిపొట్టి చిన్నారులు
చిన్నప్పటి నుంచే
సత్తా చాటుతున్నారు..

ఎత్తు తక్కువే కానీ
చెస్‌లో ఎత్తులకు
మాత్రం తక్కువ కాదని
అంటున్న మరికొందరు

బాక్సింగ్ రింగ్‌లో
కింగ్‌లున్నారు.
హార్ట్‌లను గెలిచే
ఆర్టిస్టులున్నారు..

ఈ తరం పిల్లలు
లిటిల్ విన్నర్స్..
పవర్ బూస్టర్స్
టాలెంట్‌లో మాస్టర్స్



భళా..బాల

చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు నేటి తరం బాలలు..స్పోర్ట్స్, యోగా, ఆర్ట్ ఇలా వివిధ విభాగాల్లో తమ సత్తా చాటుతున్నారు..ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కూడా అలాంటి చిచ్చర పిడుగులు ఎందరో ఉన్నారు. క్రీడల్లో అయితే జాతీయ స్థాయి వరకు ఎదుగుతున్నారు..పతకాలు సాధిస్తున్నారు.. అలాంటి లిటిల్ చాంప్స్ విశేషాలను నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా మీకు అందిస్తున్నాం..





చెస్‌లో సత్తాచాటుతున్న అనన్య

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఐఎల్‌టీడీ ప్రాంతానికి చెందిన 9ఏళ్ల చింతా అనన్య చదరంగం పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తోంది. వరుస విజయాలు కైవసం చేసుకుంటూ అదరగొడుతోంది. తన ఏడో ఏటనే చెస్ అకాడమీలో శిక్షణలోకి ప్రవేశించిన ఈమె ఏడాది కాలంలోనే 40 టోర్నమెంట్లు ఆడింది. తన తండ్రి చింతా సత్యనారాయణ కూడా చదరంగం ప్లేయర్ కావడంతో అతడి స్ఫూర్తితో ఈ ఆటలోకి అడుగుపెట్టింది. దురదృష్టవశాత్తూ ఆమె తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తండ్రి మరణం కుంగదీసినా ఆయన ఆశయాన్ని నిలబెట్టేందుకు తల్లి కళ్యాణి తన కుమార్తెను చందరంగంలో ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో 15 టోర్నమెంట్‌ల్లో పాల్గొన్న అనన్య ఐదు టోర్నమెంట్లలో విజేతగా నిలిచి రాజమహేంద్రవరం కీర్తిని ఇనుమడింపజేసింది. భవిష్యత్తులో ఈ చిన్నారిని ప్రోత్సహిస్తే జాతీయస్థాయిలో కూడా ఆడే సత్తా ఉంది.





వెయిట్ లిఫ్టింగ్‌లో బెస్ట్

చింతూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈ బాలిక మట్టిలో మాణిక్యం. వెయిట్ లిఫ్టింగ్‌లో అసమాన ప్రతిభ కనబరుస్తూ అబ్బుర పరుస్తోంది. ప్రస్తుతం +87 కేటగిరిలో తన సత్తాచాటుతోంది. ఇప్పటికే సబ్‌జూనియర్, జూనియర్ విభాగాల్లో 37 పతకాలను సొంతం చేసుకుంది. వాటిలో రాష్ట్రస్థాయిలో 36, జాతీయస్థాయిలో ఒక పతకం సాధించింది. అనకాపల్లి, ఏలూరు, జగ్గయ్యపేట, విజయనగరం, కర్నూలు తదితర కేంద్రాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మధుచందన తన సత్తాచాటి 18 బంగారం, 10 రజతం, 8 కాంస్యం పతకాలు సాధించింది. 2023లో బీహార్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించింది. త్వరలో కృష్ణాజిల్లాలో నిర్వహించనున్న అండర్-19 స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ తీసుకొంటోంది.

మధ్య తరగతి కుటుంబమే..

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన మధుచందన స్థానిక కస్తూర్బా బాలికల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తండ్రి గుత్తుల శ్రీనివాసరావు. వీరిది దిగువ మధ్య తరగతి కుటుంబం. రోడ్డు పక్కన బజ్జీల బండే జీవనాధారం. మధుచందనకు వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించాలన్న బలమైన కోరిక ఉంది. ఆర్థికలేమి వెనక్కు లాగుతున్నా ఆశయం కోసం ఆమె అహర్నిశలు కష్టపడుతోంది. 2017 నుంచే మధుచందన వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుంటోంది. చింతూరులోని శ్రీ వీరభద్ర పవర్ జిమ్ ఆమె శిక్షణ కేంద్రం. ఆది నుంచి జిమ్ యజమాని గోలి గంగాధర్ ఆమెకు శిక్షణ ఇస్తున్నారు. ఈమె కుటుంబ ఆర్థిక పరిస్థితిపై అవగాహన ఉన్న అతడు ఉచితంగానే శిక్షణ ఇస్తున్నారు.



లిటిల్ గ్రాండ్ మాస్టర్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రాండ్ మాస్టర్ అవ్వాలన్నది అతడి లక్ష్యం. ఆ దిశగా ప్రయత్నిస్తూ చెస్‌లో ఆ బాలుడు విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. ఇప్పటివరకు 50వరకు పతకాలు సాధించి.. జాతీయస్థాయిలోను మూడు బంగారు పతకాలతో ఆకట్టుకుంటున్నాడు. కాకినాడకు చెందిన సూరాడ యశస్వి సత్యగంగాధర్ కాకినాడ కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్నాడు. అతడి తండ్రి శ్రీనివాసరావు కాకినాడ ఇంటెలిజెన్స్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నారు. తల్లి మహాలక్ష్మి గృహిణి.

చెస్‌పట్ల మక్కువతో..

యశస్వికి చెస్‌పట్ల ఎప్పటినుంచో ఆసక్తి ఎక్కువ. దీన్ని గమనించిన తల్లిదండ్రులు అతడికి కేవీ ప్రసాద్ వద్ద కోచింగ్ ఇవ్వడం ప్రారంభించారు. అలా అతడు అనేక టోర్నమెంట్‌లో పాల్గొంటూ వెళ్లిన ప్రతిచోట విజయం సాధిస్తున్నాడు. కేంద్రీయ విద్యాలయ స్కూల్ తరపున నేషనల్‌లో వరుసగా మూడు బంగారు పతకాలు సాధించాడు. మూడుసార్లు స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ఎంపికయ్యాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగే అనేక చెస్ టోర్నమెంట్‌లో ఎన్నో బహుమతులు పొందాడు. స్టేట్ లెవల్ చెస్ టోర్నమెంట్‌లో అనేక పతకాలు సాధించాడు. 2018 నుంచి 2024 వరకు చెస్‌లో ఇప్పటివరకు 50 పతకాలు సాధించాడు. ప్రస్తుతం మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని ఆడుతున్నాడు. గంగాధర్‌కి చెస్ ఫిడే రేటింగ్ 1918గా ఉంది. ఇప్పటివరకు 15 బంగారు పతకాలు పొందాడు. గ్రాండ్ మాస్టర్ కావాలనుకుంటున్న ఈ బాలుడికి ఆల్ ది బెస్ట్ చెబుదాం..

సాఫ్ట్ బాల్ పోటీల్లో గ్రేట్





కరప, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆమె సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణిస్తూ సత్తా చాటుతోంది. చిన్నప్పటినుంచి క్రీడలపై ఉన్న మక్కువతో ఓపక్క చదువులో రాణిస్తూ తనకిష్టమైన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది. ఆమె కాకినాడ జిల్లా కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన పెద్దిరెడ్ల సాయిసింధూజ. గత ఐదేళ్లలో పలు జాతీయస్థాయిలో పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొని పలు పతకాలను సాధించింది. పెద్దాపురప్పాడు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ప్రాతినిత్యం వహిస్తూ జిల్లా సాఫ్ట్‌బాల్ చరిత్రలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. ఆమె జిల్లా జట్టు తరపున 17 రాష్ట్రస్థాయి పోటీల్లోను, 23 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు ట్రోఫీలు సొంతం చేసుకుంది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, తెలంగాణా, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రాష్ట్ర జట్టు విజయం సాధించేందుకు దోహదపడింది. 2020లో చైనాలో జరిగిన సాఫ్ట్‌బాల్ అండర్-17 ఆసియా కప్‌లో మన దేశం తరపున ప్రాతినిత్యం వహించింది. వ్యాయామ ఉపాధ్యాయుడు బీవీవీఎస్ ప్రసాద్ శిక్షణలో జిల్లాకు, రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ప్రస్తుతం సాయి సింధూజ స్పోర్ట్స్ కోటాలో నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించింది. తల్లిదండ్రులు దయకుమార్, పద్మావతి, పీడీ ప్రసాద్ ప్రోత్సాహంతో సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్నానని, భవిష్యత్తులో పోలీసుశాఖలో ఉద్యోగం సాధించి ప్రజలకు సేవలు చేయాలన్నది తన ఆకాంక్షని సాయి సింధూజ తెలిపింది.



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

కాకినాడ అర్బన్, నవంబరు 13: కాకినాడ రూరల్ రమణయ్యపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.ముత్యాల ముఖేష్, జె.అభిరామ్, సీహెచ్ ప్రేమ్‌కుమార్ స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో తమ సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 5నుంచి 7వరకు పల్నాడు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అండర్-17 బాలుర 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో కె.ముత్యాలముఖేష్ ద్వితీయస్థానం సాధించాడు. డిసెంబరులో గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో జె.అభిరామ్, సీహెచ్ ప్రేమ్‌కుమార్ అండర్-17 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి డిసెంబరులో కోల్‌కత్తాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం సీవీవీ నాగేశ్వరరావు, పీఈటీ ఎస్‌కే అలీమ్‌పాషా ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

యోగాలో రాణిస్తున్నాడు..

సామర్లకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న ఆ విద్యార్థి రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో ఎక్కడ యోగా పోటీలు జరిగినా అవార్డులు సాధిస్తున్నాడు. కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధిలో అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కిలారి యశ్వంత్ పదోతరగతి చదువుతున్నాడు. అతడు ఆరో తరగతి నుంచీ తన తండ్రి కిలారి వీరబాబు వద్దే యోగాసనాలపై ఆసక్తితో శిక్షణ పొందాడు. ఏడో తరగతి నుంచి జిల్లాలోనూ, పొరుగు జిల్లాలైన పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖ వంటి పలు జిల్లాలో జూనియర్స్ యోగాసనాల పోటీల్లో పాల్గొన్నాడు. ఏ పోటీలో పాల్గొన్నా ప్రథమ బహుమతిని కైవసం చేసుకోవడం విశేషం. అతడి తండ్రి ఆటోడ్రైవర్ అయినా యోగాసనాలు వేయడంలో ఎంతో పేరుంది. ఆంధ్ర రాష్ట్రంలోనే కాక ఒడిశా, పశ్చిమబెంగాల్, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన పలు జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని అత్యద్భుత ప్రతిభ కనబర్చి సభికులను, న్యాయనిర్ణేతలతో శెభాష్ అనిపించేలా యోగాసనాలు ప్రదర్శిస్తున్నాడు. అంతర్‌జిల్లాలస్థాయిలో భీమవరం, నరసాపురం, విజయవాడ, కాకినాడ, బిక్కవోలు తదితర ప్రాంతాల్లో జరిగిన యోగా పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతులు పొందానని యశ్వంత్ తెలిపాడు. తన పాఠశాల ప్రదానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణతోపాటు తల్లిదండ్రులు వీరబాబు, అన్నపూర్ణ ప్రోత్సాహంతో తాను అవార్డులు దక్కించుకోగలుగుతానని అతడు చెప్తున్నాడు.




యోగాసనాలు వేస్తున్న యశ్వంత్

కుస్తీలో సూపర్ టాలెంట్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉషు పోటీల్లో రాజమహేంద్రవరం నన్నయ మున్సిపల్ స్కూల్ విద్యార్థిని పి.శ్రీశ్రుత అత్యుత్తమ ప్రతిభ చాటుతోంది. నన్నయ మున్సిపల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఆమె రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కబర్చి పలు పతకాలు సాధించారు. శ్రీకాకుళంలో జరిగిన 68వ ఏపీ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉషు చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించింది. గతేడాది స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా జరిగిన బాక్సింగ్‌లో కాంస్య పతకం అందుకుంది. ఇంటర్ అసోసియేషన్ మీట్ నేషనల్ బాక్సింగ్ పోటీల్లో 38కిలోల విభాగంలో(రూరల్ గేమ్స్ విభాగం) ఆమె బంగారు పతకం సాధించింది.



బంగారు పతకంతో శ్రీశ్రుత




ఇంగ్లీష్‌లో మేటి ఈ బుడతడు



సామర్లకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆ చిన్నారి ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతూ దుమ్మురేపుతున్నాడు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే రెండో తరగతి చదువుతూ పలక సైతం పూర్తిగా పట్టుకోలేని ప్రాయంలో ఆంగ్ల ప్రసంగం చేస్తూ.. స్వాతంత్య్ర దినోత్సవ చరిత్రను ఐదు నిమిషాలపాటు అనర్గళంగా ఉపన్యసించి పాఠశాల విద్యార్థులనే కాదు అధ్యాపక బృందాన్ని సైతం అబ్బురపరిచారు. ఆ బాలుడు సామర్లకోట మండలం గొంచాల గ్రామానికి చెందిన కొల్లా జీవన్‌కుమార్. అతడు ఇదే గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువున్నాడు. అతడి ఆంగ్ల ప్రసంగం వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాడు. ఈ బుడతడి ఆంగ్ల ప్రసంగాన్ని సామాజిక మాధ్యమాల్లో వీక్షించిన అప్పటి పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి స్వయంగా అభినందించి నగదుతోపాటు కొన్ని ఆట వస్తువులను బహుమతులుగా అందజేశారు.

పెన్సిల్ పొట్టుతో చాచా నెహ్రూ పటం

మండపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట సంఘం కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల చిన్నారులు చాచా నెహ్రూ చిత్రపటాన్ని పెన్సిల్ పొట్టుతో తయారు చేశారు. ఈనెల 14న ఆయన జయంతిని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు పెన్సిల్ పొట్టును నిల్వ చేసి నెహ్రూ చిత్రపటం తయారీకి ఉపయోగించారు. ఐదో తరగతి విద్యార్థినులు తేజస్విని, అలేఖ్య, విషిత, భవాని అరగంటపాటు బుధవారం శ్రమించి చిత్రపటాన్ని తయారు చేశారని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.



ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి..

మరో నామినేషన్ దాఖలు



కాకినాడ జిల్లా కలెక్టర్‌కు ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నామినేషన్‌ను అందిస్తున్న నారాయణరావు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు బుధవారం మరో నామినేషన్ దాఖలైంది. మంగళవారం మొదటి నామినేషన్ దాఖలు కాగా మరో నామినేషన్‌తో కలిపి ఇప్పటికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి.

డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామకు చెందిన గంధం నారాయణరావు కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. అనంతరం కాకినాడలోని క్లబ్ ఆవ రణల్లో సమావేశం జరిపారు. ఆయన మాట్లా డుతూ ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్య ర్థిగా తనను ప్రజాస్వామికవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎస్టీయూ, ప్రైవేటు స్కూల్స్ కళాశాలలు వివిధ ప్రజా సంఘాలు బలపరిచి గెలిపించాలని కోరారు. సభను ద్దేశించి ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాసు మాట్లాడుతూ ఎస్టీయూ వల్లే రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెరిగాయన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపాలని, వారిని రెగ్యు లర్ చేయాలని పోరాటం చేస్తున్నామ న్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ఉపాధ్యాయులు అందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, ప్రైవేటు స్కూల్స్ యూనియన్ అధ్యక్షులు విశ్వేశ్వరరెడ్డి, శివ, ప్రసాద్, దొరబాబు, చలపతి పాల్గొన్నారు.

నేటి నుంచి సహకార వారోత్సవాలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సహకార వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణ తెలిపారు. వికసిత్ భారత నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అంశంపై వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో భాగంగా నేటి ఉదయం 10 గంటలకు డీసీఓ కార్యాలయంలో, పదిన్నరకు డీసీసీబీలోను సహకార ఉద్యమ బలోపేతంపై కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 15న సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత అంశాలపై డీసీఎంఎస్‌లో 5.30కు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 16న కేసీబీఎస్‌లో వ్యవస్థాపకత, ఉపాధి కల్పన నైపుణ్యాభివృద్ధి, 17న కోరంగిలో సహకార సంస్థలు వ్యాపార ప్రయోజక సంస్థలుగా రూపాంతరం చెందే అంశంపై, 18న ఆర్బిపట్నంలో సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించే అంశంపై, 19న కాకినాడ కోపరేటివ్ టౌన్ బ్యాంకులో బలహీన వర్గాల మహిళలకు, 20న జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌ల సిబ్బందితో సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఉప్పాడ తీరంలో కెరటాల ఉధృతి

రాకపోకలు బంద్

కొత్తపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉప్పాడ తీరంలో సముద్రం అల కల్లోలంగా మారింది. పౌర్ణమి దగ్గర కావడం, అల్పపీడనం తోడు కావడంతో బుధవారం రాత్రి రాకాసి కెరటాలు బీచ్‌రోడ్డుపైకి దూసుకొస్తున్నాయి. ఇక్కడి పరిస్థితిని గమనించిన కొత్తపల్లి పోలీసులు ఉప్పాడ బీచ్‌రోడ్డు గుండా వాహనాలు ప్రయాణించకుండా రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటుచేసి రాకపోకలను నిలిపివేశారు.



సముద్రతీరం వద్ద కెరటాల ఉధృతికి ధ్వంసమైన బీచ్‌రోడ్డు

గండిపోశమ్మ ఆలయ పరిసరాల పరిశీలన

దేవీపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోనున్న మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సూర్యారావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలవరం ముంపునకు గురవుతున్న అమ్మవారి గుడి, నిర్మాణం తదితర విషయాలపై అధికారులతో మాట్లాడారు. అమ్మవారి ఆలయాన్ని వేరే ప్రాంతానికి తరలించకుండా అదే ప్రదేశంలో వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. త్వరలో ఆలయ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ఆయన తెలిపారు.



గండిపోశమ్మ ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న రీజనల్ జాయింట్ కమిషనర్

పంటబోదెలోకి దూసుకుపోయిన కారు


పి.గన్నవరంలో పంటబోదెలోకి పడిపోయిన కారు

పి.గన్నవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో ఓ కారు ప్రమాదవశాత్తూ పంట బోదెలోకి దూసుకెళ్లింది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలానికి చెందిన కడలి సత్యనారాయణ వ్యవసాయశాఖ రిటైర్డ్ ఉద్యోగి. ఆయన కుటుంబం పి.గన్నవరంలో ఇంటి నిర్మాణం నిమిత్తం శ్రీకాకుళం నుంచి కారుపై వస్తుండగా మంగళవారం తెల్లావారుజామున పి.గన్నవరం మండలం బెల్లంపూడి గెదాలమ్మ అమ్మవారి ఆలయం దగ్గర్లో పంటబోదేలోకి దూసుకుపోయింది. దీంతో కారులో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు.

అతి సూక్ష్మ శివలింగం తయారీ


అతి సూక్ష్మ స్వర్ణ శివలింగం..


తయారీలో నిమగ్నమైన కోటేశ్వరరావు

తుని రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పర్వదినాన్ని పురస్కరించుకుని శివుడిపై ఉన్న భక్తిభావంతో కాకినాడ జిల్లా తునికి చెందిన స్వర్ణకారుడు కోటేశ్వరరావు అతి సూక్ష్మ స్వర్ణ శివలింగాన్ని తయారు చేశాడు. 100 మిల్లీ గ్రాముల బంగారాన్ని ఉపయోగించి 3గంటల సమయంలో శివలింగాన్ని తయారు చేశాడు. ఆయనకు స్వర్ణకారులు, తుని పట్టణవాసులు నుంచి అభినందనలు తెలిపారు.

కన్నుల పండువగా సత్యదేవుడి నౌకావిహారం



అన్నవరం పంపా నదిలో హంసవాహనంపై విహరిస్తున్న సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లు

- ఘనంగా స్వామివారి తెప్పోత్సవం
- భక్తి, శ్రద్ధలతో వీక్షించిన భక్తులు

అన్నవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అన్నవరంలో సత్యదేవుడి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం 5గంటలకు ప్రధానాలయం నుంచి సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, క్షేత్రపాలకులైన సీతారాములను మేళతాలాలు, వేదమంత్రాల నడుమ ఘాట్‌రోడ్డు గుండా పంపా సరోవర తీరానికి తోడ్కొనివచ్చారు. అక్కడ వివిధ సుగంధభరిత పుష్పమాలికలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్లను, మరో వేదికపై సీతారాములను ఆశీనులు గావించి పండితుల వేదస్వస్తితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం శ్రీసూక్త పురుషసూక్త విధానంలో తులసి ధాత్రి(ఉసిరి, తులసి) పూజను ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అర్చకస్వాములు నిర్వహించారు. కార్తీకమాసంలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశి రోజున శ్రీ మహావిష్ణువు యోగనిద్ర నుంచి మేల్కొనడానికి ప్రతీకగా ఈ వేడుక జరపడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీమ హావిష్ణువు స్వరూపుడైన సత్యదేవుడికి ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా తెప్పోత్సవం నిర్వహిస్తారు. పంపా తీరంవద్ద ప్రత్యేకపూజలు తర్వాత స్వామి,అమ్మవార్లను, క్షేత్రపాలకులను ప్రత్యేకంగా రూపొందించిన హంస వాహనంలో రుద్రాక్ష మండపంలో ఆశీనులు గావించి వేదస్వస్తి పలుకుతూ హారతులిచ్చారు. అనంతరం పంపాతీరంలో భక్తుల గోవిందనామస్మరణల నడుమ మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. వైదిక కార్యక్రమాలను ఇంద్రగంటి బుల్లి, చామర్తి కన్నబాబు, పాలంకి చిన్న పట్టాభి, వేదపండితులు చిట్టి శివ, గంగబాబు, గొల్లపల్లి ఘనాపాఠి నిర్వహించారు. ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు. వేడుకను తిలకించేందుకు విచ్చేసిన ప్రముఖులకోసం ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం

కోరుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కోరుకొండ లక్ష్మీనరసింహస్వామివారి క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి దేవుని కోనేటిలో స్వామి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంనుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు,వేదమంత్రోచ్చారణల మధ్య స్వామిని ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించి గిరి ప్రదక్షిణగా దేవుని కోనేరు వద్దకు తోడ్కొని వచ్చారు. ఆలయ అనువంశక ధర్మకర్త పరాసరరంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశక అర్చక స్వాములు వైకాసనఆగమశాస్త్రం ప్రకారం స్వామికి దేవుని కోనేరువద్ద ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అన్నవరందేవస్థానం అధికారులు స్వీయ పర్యవేక్షణలో పోలీస్ ఉన్నతాధికారుల బందోబస్తువద్ద స్వామిని కోనేటిలో హంస వాహనంపై ఆశీనులుగావించారు. లక్ష్మీనరసింహస్వామికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, తహసీల్దార్ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి హంస వాహనం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి

» అశేషంగా తరలివచ్చిన భక్తజనం

భవనాసిన దివ్యకోనేటిలో మూడుసార్లు హంస వాహనంపై స్వామివారు విహరించారు. ఈ సందర్భంగా కార్తీక దీపాలను వెలిగించి వేద పండితులు, అర్చక స్వాములు తెప్పోత్సవం నుంచి దేవుని కోనేటిలో వదిలారు. కోరుకొండ, కాపవరం, పశ్చిమగోనగూడెం, జంబుపట్నం, శ్రీరంగపట్నం పరిసర గ్రామాల నుంచి వేలాదిమంది భక్తజనం దేవుని కోనేటి వద్దకు చేరుకుని స్వామి తెప్పోత్సవం కన్నుల విందుగా తిలకించి పులకించారు. స్వామిని హంసవాహనంపైనుంచి తోడ్కొని వచ్చి దేవుని కోనేటివద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో ఆశీనులు గావించి ప్రత్యేక సేవాకాలం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, వారి కుటుంబసభ్యులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ, మాజీ సర్పంచ్ అడపా వీరబాబు, అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ రమణ, కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ శ్యామసుందర్ బందోబస్తు నిర్వహించారు.


స్వామికి ప్రత్యేక సేవాకాలం


కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి క్షీరాబ్ధి ద్వాదశి తెప్పోత్సవం

కొండ చిలువ హల్‌చల్


కొండ చిలువను అడవిలో వదులుతున్న దృశ్యం

మోతుగూడెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద పది అడుగుల కొండ చిలువ హల్‌చల్ చేసింది. దీన్ని గమనించిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు.

41వ సారి రక్తదానం చేసిన ఉపాధ్యాయుడు

కొత్తపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం మూలపేట సెజ్ పునరావాస కాలనీ ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయుడు అడపా వెంకట శ్రీనివాసరావు 41వ సారి రక్తదానం చేశారు. తలసేమియా చిన్నారుల కోసం కాకినాడ చేయూత బ్లడ్ బ్యాంక్ గురువారం ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన ఈ రక్తదానం చేశారు. ఆయన చేయూత బ్లడ్‌బ్యాంక్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.


రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

1250 కిలోల నకిలీ టీపొడి పట్టివేత

గోకవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం రంపఎర్రంపాలెం గ్రామంలో గోకవరం పోలీసులు దాడి చేసి 31 బస్తాల్లో నిల్వ చేసిన 1250 కిలోల నకిలీ టీపొడిని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి గోకవరం ఎస్ఐ పవన్ కుమార్ విలేకరులకు తెలిపిన వివరాలివి. తమకు అందిన సమాచారం మేరకు రంపఎర్రంపాలెంలోని శ్రీ వెంకటరామ రైస్‌మిల్‌కు వెళ్లి తనిఖీ చేయగా అందులో అక్రమంగా తయారు చేస్తున్న నకిలీ టీపొడిని గుర్తించామన్నారు. 31 బస్తాల్లో 1250 కిలోల టీపొడిని పట్టుకున్నామన్నారు. టీపొడి తయారు చేయడానికి ఉపయోగించే ముడిసరుకు క్రీం కలర్ కలిగిన బ్యాగులు 15, బూడిద రంగు కలిగిన బ్యాగులు 14, బట్టల సోడా 2 బ్యాగులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కోరుకొండ సీఐ వై.సత్యకుమార్ ఆదేశాల మేరకు జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ అధికారుల సమక్షంలో టీపొడి శాంపిళ్లను తీసి ల్యాబ్‌కి పంపించామన్నారు.నకిలీ టీపొడి, ముడిసరుకులను సీజ్ చేశామని వారిపై కేసు నమోదు చేసి చర్యలుతీసుకుంటామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.


నకిలీ టీపొడితో పట్టుబడిన బస్తాలు

భారీగా సెల్‌ఫోన్ల రికవరీ

- కాకినాడలో 600 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత
- మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్‌కి విశేష స్పందన
- కాకినాడ ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు

కాకినాడ క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో భారీగా సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. కాకినాడ జిల్లా చోరీకి గురైన రూ.78లక్షల విలువ చేసే 600 మెగా సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఎస్పీ బాధితులకు అప్పగించారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్ సేవలకు విశేష స్పందన లభిస్తోంది. ఖరీదైన సెల్‌ఫోన్లను తమకు అప్పగించిన ఎస్పీకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడజిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రదర్శించారు. వీటిని పరిశీలించి సంబంధిత సెల్‌ఫోన్ల బాధితులకు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చోరీ, మిస్ అయిన ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్ సేవల ద్వారా స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.78లక్షల విలువ చేసే 600 సెల్‌ఫోన్లను సంబంధిత లబ్ధిదారులకు అందించామన్నారు. ఇప్పటివరకు మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్ సేవల్లో ఇదే మెగా సెల్‌ఫోన్ల రికవరీగా నిలిచిందన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో భాగంగా కాకినాడ ఐటీ కోర్ బృందం, జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల క్రైం బృందాల సంయుక్త కృషితో పెద్ద ఎత్తున రికవరీ చేశామన్నారు. సెల్‌ఫోన్ చోరీకి గురైనా, మిస్సింగ్ అయినా మొబీ ట్రాక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రికవరీ కోసం విశేష కృషి చేసిన ఐటీ కోర్ టీం ఇన్‌స్పెక్టర్ డి.దుర్గాప్రసాదరెడ్డి, ఐటీ కోర్ బృందం సభ్యులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ, సిబ్బందిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. చోరీకి గురైన ఖరీదైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి తమకు అందజేసిన ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పోలీసు అధికారులు, సిబ్బంది లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు


విద్యార్థినికి సెల్‌ఫోన్ అందిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కడియంలో ట్రైనీ కలెక్టర్ల పర్యటన


కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్‌లో ట్రైనీ కలెక్టర్లకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కడియం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ కలెక్టర్లు క్షేత్రస్థాయి రెండురోజుల శిక్షణలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలోని కడియపులంక, కడియం గ్రామాలను బుధవారం సందర్శించారు. ట్రైనీ కలెక్టర్లు అనురాగ్ బాబెల్(టీమ్ లీడర్), ప్రియారాణి, ఎస్.బేగం, పారత్, కె.భక్తి, నిరంజన్ జయదేవరావు (అసిస్టెంట్ టీమ్ లీడర్), టి.నాగి, ఎ.మిశ్రా, స్నేహ పన్నాలు బృందంగా ఈ గ్రామాలను సందర్శించారు. కడియపులంకలో సర్పంచ్ ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పంతం గణపతి వారికి స్వాగతం పలికారు. పూలమార్కెట్‌లో పూల ఉత్పత్తి, ఏఏ ప్రాంతాలకు పూలు సరఫరా అవుతున్నాయి. ఈ ప్రాంతంలో పండే పూలు, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే పూలు తదితర విషయాలను వ్యాపారులను అడిగారు. అనంతరం కడియం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ వారికి స్వాగతం పలికారు. మండల పరిషత్‌లో ఉన్న శాఖలు, అభివృద్ధి పనులు అమలు వంటి వాటిని పరిశీలించారు. మహిళా సమాఖ్య భవనంలో మహిళలు తయారు చేస్తున్న అగరబత్తీ కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్లు బృందం సందర్శించారు. తయారీ విధానం, మార్కెటింగ్, తయారీకి వాడే పదార్థాలు వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. మహిళా ట్రైనీ కలెక్టర్లు అగరబత్తీలను తయారు చేసే మహిళలతో కలిసి అగరబత్తీలను తయారు చేశారు. కడియంలో ఉన్న పరిశ్రమను పరిశీలించారు. ఉత్పత్తి మార్కెటింగ్ వంటి విషయాలు తెలుసుకున్నారు. అనంతరం కడియం గ్రామ పంచాయతీకి చేరుకున్నారు. సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురామ్(నాని)లు ట్రైనీ కలెక్టర్ల బృందానికి స్వాగతం పలికారు. అక్కడ మహిళలు కొబ్బరి పీచుతో తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, ఎంపీడీవో రమేష్, ఉద్యానశాఖ అధికారి సుధీర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


కడియంలో అగరబత్తీలు తయారు చేస్తున్న ట్రైనీ కలెక్టర్లు

నా చిన్ననాటి కల

అనురాగ్, రాజస్థాన్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ - ఐఎఫ్ఎస్



మాది రాజస్థాన్ రాష్ట్రం. సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించి జాతీయ కొలువు సాధించాలనేది నా చిన్ననాటి కల. బెంగుళూరు దయానందసాగర్ విశ్వవిద్యాలయంలో బీటెక్ కంప్యూటర్ సైన్సు చదివాను. ఫారెస్టు అధికారి పి.శ్రీనివాస్ నాకు ఆదర్శం. తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో డిల్లీలో శిక్షణ పొంది ఇండియన్ ఫారెస్టు సర్వీస్ ఉద్యోగం సాదించాను.

మంచి ర్యాంకు సాధించా

అటుల్, ఉత్తరప్రదేశ్, ఇండియన్ ఫారెన్ సర్వీస్ - ఐఎఫ్ఎస్



మాది ఉత్తర ప్రదేశ్. డిల్లీ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ(భౌతికశాస్త్రం) చదివాను. సివిల్స్ ప్రిపేరవుతూ యూపీఎస్సీలో మంచి ర్యాంకు సాధించాను. ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ అధికారి జయశంకర్ నాకు స్ఫూర్తి. తండ్రి ఉపాధ్యాయుడు. తల్లి గృహిణి. సోదరి పీహెచ్‌డీ చదివి ఉద్యోగంలో ఉన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది

నిరంజన్, మహారాష్ట్ర, ఇండియన్ పోలీస్ సర్వీస్ - ఐపీఎస్



మాది మహారాష్ట్ర. పూణే విశ్వవిద్యాలయంలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చదివాను. ఇండియన్ సర్వీసెస్‌లో మంచి హోదాలో చూడాలనేది మా తల్లిదండ్రుల కల. వారి ప్రోత్సాహంతో యూపీఎస్సీలో మంచి ర్యాంకు సాధించి ఇండియన్ పోలీస్ సర్వీస్ ఉద్యోగం సాధించాను.

మంచి ఉద్యోగం కల

సహిదా, తమిళనాడు, ఇండియన్ రెవెన్యూ సర్వీస్ - ఐఆర్ఎస్



మాది తమిళనాడు. సివిల్ సర్వీసెస్‌లో మంచి ఉద్యోగం పొందాలనేది కల. తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడైంది. ప్రణాళికాబద్ధంగా చదివగా ఇండియన్ రెవెన్యూ సర్వీస్ ఉద్యోగం లభించింది.

హత్య కేసులో నిందితుడికి జైలు

జగ్గంపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి పెద్దాపురం ఏడో ఫాస్ట్‌ట్రాక్ జిల్లా కోర్టు జీవిత ఖైదు విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. సీతానగరం గ్రామానికి చెందిన వానిశెట్టి సింహాచలం, నైనపె శ్రీను కల్లు గీత కార్మికులు. ఇద్దరూ పక్కపక్కనే వ్యాపారం చేస్తుండేవారు. సింహాచలం భార్యతో శ్రీను వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీనికి బత్తిన భవానీ అనే మహిళ సహకరించేది. ఈ విషయం తెలుసుకున్న సింహాచలం వెంట తెచ్చుకున్న కల్లు గీత కత్తితో నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. తర్వాత వెంటనే కల్లు అమ్ముతున్న శ్రీను వద్దకు వెళ్లి అతడిని నరికాడు. అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ఘటన 2013 ఏప్రిల్ 11వ తేదీన జరిగింది. దీనిపై విచారణ చేసిన కోర్టు సింహాచలానికి జీవిత ఖైదు విధించింది.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

తుని రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తుని రైల్వే స్టేషన్ శివారు ఓ వ్యక్తిని గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. రాజీవ్ కాలనీ ఎదురుగా పట్టాలు దాటుతుండగా విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మృతదేహం వద్ద ఏ ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసిన రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు మృతదేహాన్ని ఏరియా హాస్పటల్ మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులను 9490619020లో సంప్రదించాలని కోరారు.

ఎటపాకలో వ్యాయామ ఉపాధ్యాయుడి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

ఎటపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యాయామ(పీఈటీ) ఉపాధ్యాయుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎటపాక మండలం కేఎన్‌పురం(కొత్తూరు నారాయణపురం)కు చెందిన కణితి నాగరాజు (28) కుటుంబ కలహాలతో 3రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి మృతి నాగరాజు చెందాడు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా రాజవొమ్మంగి జడ్పీ హెచ్ఎస్‌లో ఈయన పనిచేస్తున్నాడు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక తవ్వడానికి వెళ్లి వ్యక్తి మృతి

కోటనందూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాండవ నదిలోకి ఇసుక తవ్వకానికి వెళ్లిన వ్యక్తి నీటి మునిగి మృతిచెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బొద్దవరం గ్రామానికి చెందిన కొత్తపల్లి అప్పలనాయుడు (40) గ్రామ శివారులో గల అర్తమూరు రెవెన్యూలో తాండవనదిలో బుధవారం ఇసుక తవ్వకానికి ఎడ్లబండితో వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో పాటు పెద్దగొయ్యి కూడా ఉండడం గమనించకపోవడంతో నీటిలో పడిపోయాడు. దీంతో కింద పడినవ్యక్తి పైకి రాలేదు. ఎడ్లబండి కూడా మునిగిపోవడంతో ఒక ఎద్దు కూడా చనిపోయింది. దీంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి. వ్యవసాయ కూలీ పని చేసుకుంటున్న ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని అతికష్టంమీద పైకి తీసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.


నదిలో నుంచి అప్పల నాయుడు మృతదేహాన్ని బయటకు తెస్తున్న దృశ్యం

17న పుష్కరవనంలో బీసీ ఉద్యోగుల కార్తీక వన సమారాధన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ బీసీ/ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ద్వితీయ కార్తీక వనసమారాధన 2024ను ఈనెల 17న ఆదివారం రాజమహేంద్రవరం ఆటోనగర్ పుష్కర వనంలో నిర్వహిస్తున్నట్లు సంఘం తెలిపింది. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగులు పాల్గొని ఐక్యతను పటిష్టపరచాలని కోరారు.

సౌర శక్తి ప్యానల్స్‌తో

విద్యుత్ ఖర్చులు ఆదా

• జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజానగరం/రాజమహేంద్రవరంరూరల్ 13 (ఆంధ్రజ్యోతి):పీఎం-కెయుఎస్‌యుఎం (ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జ సురక్ష యావం ఉత్థాన్ మహాభ్యాన్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. రాజమహేంద్రవరం సీటీఆర్ఐ అనుబంధంగా పనిచేస్తున్న కలవచర్లలోని కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నేషనల్ స్కిల్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్ఎఫ్ఐ)అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో బుధవారం సీటీఆర్ఐలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీటీఆర్ఐ హెడ్, పోస్టు హార్వెస్ట్ టెక్నాలజీ డివిజన్ ఎల్‌కె ప్రసాద్ అధ్యక్షతన వహించిన ఈసదస్సులో పలువురు అధికారులు మాట్లాడుతూ సౌరశక్తి ఉత్పాదకత, భూమి విస్తీర్ణం, చౌడు భూముల్లో సౌరశక్తి ప్యానల్స్ ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. హరిత గృహాలు, నీడలో పెరిగే పంటలకు చాలా లాభదాయ కం గా ఉంటాయని వివరించారు. ఇళ్లపైన సౌరశక్తి ప్యానల్స్ ఏర్పాటు చేసు కోవడంవల్ల గృహాలకు విద్యుత్ ఖర్చును తగ్గించుకోవవచ్చని సూచించారు. ఈసదస్సులో కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, ఎన్ఎస్ఎఫ్ఐ అధికారులు భాను, కేవీకే సిబ్బంది జేవీయల్ సత్యవాణి, విజయవర్ధన్, రత్నాజీ, బీఆర్ అంబేడ్కర్ జిల్లా, కాకినాడజిల్లాలోని వివిధ మండలాలకు చెందిన అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈవోలు, డైరెక్టర్లు, ఎన్జీవో సభ్యులు, రైతు మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మాధవరావు

చేనేత వస్త్రాల తయారీలో నేతన్నల కష్టం

• నూలు తయారీ నుంచి వస్త్రం తయారీ వరకు బృందం పరిశీలన
• పులగుర్త చేనేత స్టోర్‌లో చీరలు కొనుగోలు చేసిన మహిళా ట్రైనీ కలెక్టర్లు

అనపర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేనేత తయారీ వెనుక నేతన్నల కష్టాలను స్వయంగా పరిశీలిస్తే వారిపై ఎంతో గౌరవం పెరిగిందని నేత వస్త్రాల తయారీ వెనుకనున్న వారి కృషి పట్టుదల తమ కళ్లకు కట్టినట్టు కనిపించాయని ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన 99వ ఫౌండేన్ కోర్సుకు చెందిన అల్ ఇండియా సర్వీసుకు చెందిన పదిమంది ట్రైనీ అధికారులు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం అనపర్తి మండలం పులగుర్తలోని చేనేత సొసైటీని సందర్శించారు. ఈ సందర్భ ంగా వారికి డీఆర్‌డీఏ పీడీ మూర్తి ఆధ్వర్యంలో వీవర్స్ సొసైటీ అధికారులు చేనేత పరిశ్రమ గురించి వివరిస్తూ నేత వస్త్రాల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ముందుగా చేనేత పరిశ్రమలో వస్త్రాల తయారీకి అవసరమైన నూలు తయారీ యూనిట్‌లో నూలు తయారీ విధానాన్ని వివరించారు. అదే విధంగా అక్కడి నుంచి నేత విభాగంలో వస్త్ర తయారీ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా అధికారులు అక్కడ పనిచేస్తున్న కార్మికుల జీవన విధానాన్ని వారి కష్టానికి లభి స్తున్న ప్రతిఫల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నూలు తయారీ నుంచి అనేక విభాగాల్లో మహిళలే ఎక్కువ శాతం ఎందుకు పనిచేస్తున్నారని వీరంతా ఈ వృత్తినే ఎందుకు ఎంచుకున్నారన్న అధికారుల అనుమానాలను స్వయంగా మహిళా కార్మికులే వివరించారు. అనాధిగా తమ కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని అందుకే తామంతా ఇదేవృత్తిలో కొనసాగుతున్నామని వారు వివరించారు. నేత విభాగాల్లో ఎక్కువశాతం మహిళలే ఉండేందుకు కారణం కూడా లేకపోలేదని నూలు తయారీ నుంచి నూలుకు రంగులు అద్దడం వంటి కార్యక్రమాల్లో పురుషులకన్నా మహిళలే అలుపు సొలుపు లేకుండా చేయగలరని అందుకే ఎక్కువశాతం సొసైటీలలో మహిళలకే ప్రాధాన్యం లభిస్తుందని వారు అధికారులకు వివరించారు. చివరిగా అధికారులు చేనేత వస్త్రాల స్టోర్‌ను సందర్శించి అక్కడి వస్త్రాలను పరిశీలించారు. ఇవన్నీ ఇక్కడే తయారైన వస్త్రాలేనా అంటూ వారు ఆశ్చర్యపోయారు. అంతేకాకుండా బృందంలో ఉన్న మహిళా అధికారి ణులు తమకు నచ్చిన చీరలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేల కార్మికుల ఎంతో కష్టపడి వస్త్రాలను తయారు చేస్తున్నారని వారిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మూర్తి మాట్లాడుతూ ఈ బృందం ఈనెల 9వ తేదీన జిల్లాకు వచ్చిందని 16వ తేదీ వరకు జిల్లాలోని పలు అంశాలను అధ్యయనం చేస్తుందని దీనిలో భాగంగా క్షేత్ర స్థాయిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య పనులు ఇలా పలు అంశాలపై పరిశీలనచేసి అటు అకాడమీకి ఇటు జిల్లా కలెక్టరుకు జిల్లా పరిస్థితులపై వారు అధ్యయనం చేసిన అంశాలపై నివేదిక అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ల బృందం వెంట తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, సొసైటీ ప్రతినిధి పేరిశెట్టి లాలయ్య, చేనేత సొసైటీ అధికారులు పాల్గొన్నారు.


పులగుర్తలో చేనేత సొసైటీలో దూది నుంచి నూలు తయారు చేసే ప్రక్రియను ట్రైనీ కలెక్టర్లకు వివరిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

చక్రద్వారబంధంలో

తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జికూటివ్ ఇంజనీర్ గిరి

రాజానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చక్రద్వారబంధం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యలను సత్వర పరిష్కాం చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి.గిరి పేర్కొన్నారు. నీళ్లు కావాలంటే పని మానుకోవాల్సిందే శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంలో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు బుధవారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి తాగునీటి సరఫరా గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే గ్రామంలో ఉన్న మూడు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను అనుసంధానం చేసే పనులు చేపట్టామన్నారు. నీటి సరఫరా సమయంలో గ్రామంలోని దిగువ ప్రాంతాలకు నీరు తరలి పోకుండా ఉండేలా ఆయా ప్రాంతాలను గుర్తించి వాల్వులను అమర్చామన్నారు. పూర్తి స్థాయిలో ప్రజలందరికీ తాగునీరు సరఫరా చేయాలన్నదే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని ఈఈ గిరి చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూ ఎస్ డీఈలు బి.శ్రీనివాస్, తోరాటి వెంకట సుబ్బారావు, ఏఈ అవినాష్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

● కలవచర్ల రెవెన్యూ సదస్సులో జేసీ

రాజానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వేలో తలెత్తిన లోపాలను సరిచేసేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని, తమ భూములకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు తెలిపారు. రాజానగరం మండలం కలవచర్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామసభలో ఆర్‌వోఆర్ నిమిత్తం నాలుగు అర్జీలు, భూముల సర్వేకోసం 11 మంది అర్జీలు అందజేసినట్లు చెప్పారు. గ్రామానికి చెందిన చప్పిడి భవానీ సర్వే నంబరు 575/2ను 576,575గా మార్చుకోరుతూ అర్జీ అందజేశారన్నారు. అలాగే ఆదం శ్రీహరికి చెందిన పొలం విస్తీర్ణం సర్వే నంబరులో 494/ఏ71లో ఉన్న 50 సెంట్లు భూమి విస్తీర్ణం కొలతలు 49సెంట్లుగా నమోదైందని సరిచేయాలని కోరారన్నారు. ఈసదస్సులో రాజానగరం తహసీల్దార్ ఎస్.లక్ష్మీలావణ్య, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న జేసీ చిన్న రాముడు


సీఎం చంద్రబాబుకు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న అక్కిన మునికోటేశ్వరరావు

సీఎంను కలిసిన టీటీడీ బోర్డు సభ్యుడు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలకమండలి సభ్యుడు అక్కిన మునికోటేశ్వరరావు బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించారు. తనకు టీటీడీ బోర్డు డైరెక్టర్‌గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌లను కలిసిన వారిలో నగర ప్రముఖుడు చెరుకూరి కృష్ణాజీ, వ్యాపారవేత్త ఈద్పుగంటి రాజీవ్, పారిశ్రామికవేత్త అక్కిన శ్రీనివాస్ చౌదరి, మాజీ కార్పొరేటర్, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు పరిమి శ్రీనివాస్ (వాసు), చెరుకూరి సువీర్ధి ఉన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సీతంపేట ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు 14న నెహ్రూజయంతితో కార్యక్రమాలు ప్రారంభిస్తారు. 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. 16న గ్రంథాల ఉద్యమకారుల సంస్మరణ సభ, 17న రచయితల సందేశాలు, కవి సమ్మేళనం సెమినార్లు, నిర్వహిస్తారు. 18న విద్యార్థి దశలో గ్రంథాలయాల అవశ్యకత అనే అంశంపై సమీక్ష సమావేశం, 19న మహిళా దినోత్సవం, దిశ చట్టంపై అవగాహన, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన ర్యాలీ, ముగింపు ఉత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథులుగా నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్, డీఈవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మా రిసెట్టి సత్యనారాయణ, ఎల్‌ఐసీ ఆఫీసర్ చెక్క తాతారావు, ప్రముఖ కవులు, వైద్యులు, సామాజిక సేవకులుపాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

రంగారావుకు నల్లమిల్లి అభినందనలు

అనపర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి టీడీపీ నాయకుడు రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావుకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరిలోని ఏపీడీఈఎఫ్ కార్యాలయంలో ఆయనను కలిసిన నల్లమిల్లి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నల్లమిల్లి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కృష్ణ రంగారావుకు సుముచిత స్థానం లభించిందన్నారు.


సుజయ కృష్ణ రంగారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

మైక్రో ఇరిగేషన్‌తో చిన్న, సన్నకారు రైతులకు చేయూత

సీతానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మైక్రో ఇరిగేషన్ ద్వారా చిన్న సన్నకారు రైతులకు సబ్సిడీ ద్వారా చేయూత నిస్తామని జిల్లా మైనర్ ఇరిగేషన్ అధికారి ఎ.దుర్గేష్ అన్నారు. బుధవారం కాటవరం గ్రామంలో మార్కెటింగ్, ఉద్యావనశాఖ సంయక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయలు పండించే రైతులకు సాగు పద్ధతులు, మెళకువలు, అధిక దిగుబడికి తీసుకోవలసిన జాగ్రత్తలు, నీటి యాజమాన్యం వ్యవసాయ పద్ధతులపై డ్రిప్ ఇరిగేషన్ స్పింకర్ విధానం, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. మైక్రోఇరిగేషన్ సబ్సిడీ కింద సన్న, చిన్నకారు రైతులకు చేయూత నివ్వడ జరుగుతోందన్నారు. బిందుసేద్యం యూనిట్స్ చిన్న సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ కింద రెండు హెక్టార్ల విస్తీర్ణం వరకు గరిష్టంగా రూ. 2.18లక్షల సబ్సిడీ పరిమితి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారన్నారు. కోస్టల్ ప్రాంతంలోని ఇతర మధ్యస్థ పెద్ద రైతులు వర్గంతో సంబంధం లేకుండా 50శాతం సబ్సిడీ కింద 2 నుంచి 5 హెక్టార్ల విస్తీర్ణం వరకు గరిష్టంగా రూ.3.09లక్షలు సబ్సిడీ పరిమితి తో యూనిట్స్‌కు ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. మార్కెటింగ్ ఏడీ ఎం.సునీల్ వినయ్,మండల మైక్రో ఇరిగేషన్ అధికారి శైని, రైతు బజారుకువచ్చే కూరగాయలు పండించే రైతులు, ఎస్టేటు అధికారులు ఉద్యానవనశాఖ, మైక్రో ఇరిగేషన్, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు


కూరగాయల రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెట్రిక్ టన్నుకు రూ.70.19 చెల్లించాలి

సీతానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్రిక్ టన్నుకు రూ 70.19లు చెల్లించాల్సి ఉంటుందని సీతానగరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎస్ఐ రామ్‌కుమార్‌లు తెలిపారు. బుధవారం వంగలపూడి ఇసుక ర్యాంపు వద్ద ఉచిత ఇసుక విధానం-2024 ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌మాట్లాడుతూ ఉచిత ఇసుక రీచ్‌లో అవకతవకలు జరిగితే డివిజన్ కంట్రోల్ రూమ్ నెం.088324423 44కు జిల్లా కంట్రోల్ రూమ్ నెం18004252540కు ఫోన్‌చేయాలని తెలిపారు. వంగలపూడి రీచ్ వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో రీచ్ పేరు పాన్ ఇండియా ఓపెన్ రీచ్ అని తెలిపారు. ఉచిత ఇసుకను ట్రాక్టర్లపై నిబంధనలకు లోబడి తీసుకువెళ్లవచ్చని తెలిపారు


నూతన ఇసుక విధానం ఫ్లెక్సీని ఏర్పాటుచేసిన తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రామ్‌కుమార్

ప్రభుత్వమే నేరుగా 108 సర్వీసులు నిర్వహించాలి

● అధికారులకు 108 సిబ్బంది సమ్మె నోటీసు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వమే నేరుగా 108 ఆరోగ్యసేవలను నిర్వహించాలని, తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈమేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం 108 ఆరోగ్య సిబ్బంది సమ్మె నోటీసును కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సర్వీస్ ప్రొవైడర్లకు సేవలు అప్పగించడం ద్వారా సర్వీస్ మోటో దెబ్బతింటున్నదని అన్నారు. ప్రజాధనం కూడా దుర్వినియోగం అవుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం నూరుశాతం నిధులు చెల్లిస్తూ సర్వీసులను ప్రైవేట్‌పరం చేయడం సరికాదని, ప్రభుత్వమే నేరుగా 108 సర్వీసులను నిర్వహించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు. పలువురు 108 ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న 108 ఆరోగ్యసిబ్బంది

సీఎం చంద్రబాబును కలిసిన చైర్మన్ కుడుపూడి సత్తిబాబు



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కుడుపూడి సత్తిబాబు అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారితో పాటు మంత్రులు కొల్లు రవీంద్ర, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలను కలిసి సత్కరించారు. తనకు అప్పజెప్పిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచిపేరు తెస్తానని కుడుపూడి చెప్పారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో ఆదివాసీల కీలకపాత్ర


బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న అధికారులు

దివాన్‌చెరువు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : భారతస్వాతంత్ర్య ఉద్యమంలో ఆదివాసీలు కీలకపాత్ర పోషించారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం గిరిజన స్వావలంబన వేడుకలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యంగా బిర్సా భగవాన్ భారతీయ అటవీజాతుల స్వాతంత్ర్య సమరయోధుడుగా, జానపదనాయకుడిగా, ఆంగ్లేయుల పాలన నుంచి భారతదేశ విముక్తపోరాటాలు చేసిన యోధులుగా నిలిచారని అన్నారు. మరో ముఖ్యఅతిథి వనవాసీ కళ్యాణ ఆశ్రమ్ జాతీయ సలహాదారులు పి.స్వామియాజులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసింది గిరిజనులే అని తరువాత కాలంలో మిగిలిన ప్రాంతాలలో ఉద్యమాలు సాగాయన్నారు ఉద్యమంతో పాటు గిరిజనసంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడంలో బిర్సా ముండా కీలకపాత్ర పోషించారని చెప్పారు. తొలుత భగవాన్ బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, కార్యక్రమ కోఆర్డినేటర్ ఆర్.ఎస్.వరహాలదొర పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి దీపోత్సవం

కోరుకొండ, నవంబరు13(ఆంధ్రజ్యోతి):పవిత్ర కార్తీక మాసం ద్వాదశి సందర్భంగా బుధవారం సాయంత్రం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వారి కొండకు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. పశ్చిమగోనగూడెం సర్పంచ్ రొంగల దేవిక, శ్రీనివాస్ స్వామివారి పాదాలవద్ద మొదటి దీపాలు వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు

20 బస్తాల బియ్యం వితరణ

కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండ దిగువున కార్తీక మాసం 30రోజులు భక్తుల సహకారంతో నిర్వహిస్తున్న దివ్య అన్నదానానికి బూరుగుపూడి గ్రామానికి చెందిన అయ్యన్నగళ్ళ ఆవ భూముల ఉద్యమ నాయకుడు డాక్టర్ అడపా శ్రీనివాస్ 20బస్తాల బియ్యాన్ని అన్నదాన కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుఎన్నడూ జరగని విధంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కొండ దిగువున కార్తీక అన్న సమారాధన పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. సమావేశంలో తనకాల నాగేశ్వరరావు, అడపా వీరబాబు, దొర, కర్రి వీరగణేష్, అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సలహాదారుడు షరీఫ్‌ను కలిసిన గన్నికృష్ణ


షరీఫ్‌కు అభినందనలు తెలుపుతున్న గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా నియమితులైన శాసన మండలి మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత మహమ్మద్ షరీఫ్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అమరావతిలో షరీఫ్‌ను కలిసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించుకున్నారు. పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా షరీఫ్‌కు తగిన గుర్తింపు నివ్వడం సంతోషకరమని గన్ని అన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు మంచి రోజులు

● పతాంజలి ఆయిల్ కర్మాగారం ఉన్నతాధికారి పట్టాభిరామిరెడ్డి

రంగంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు రైతులకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని పెద్దాపురం పతాంజలి పామ్ ఆయిల్ కర్మాగారం ఉన్నతాధికారి పట్టాభి రామిరెడ్డి అన్నారు గురువారం రంగంపేట మండలం సింగంపల్లిలో జరిగిన పామాయిల్ రైతుల సాగు అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏడాదిగా టన్ను 12 నుంచి13 వేల రూపాయలు ఉన్న పామాయిల్ ధర ఇప్పుడు 19 వేల రూపాయలకు చేరిందని ఒకటి రెండు నెలల్లో ఇది 20 వేలకు పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పామ్‌ఆయిల్ పంటను ప్రోత్సహిస్తున్నామని ఫ్యాక్టరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్ అన్నారు. ఇతర పంటలతో పోల్చిచూస్తే పామాయిల్ తోటలు సాగు లాభసాటిగా ఉన్న కారణంగా రైతులు ఇతర పంటల నుంచి ఈ పంటలకు మల్లాలని ఉద్యానశాఖ అధికారి అరవింద్ సూచించారు. పెరిగిన ఈ ధరను కొనసాగించాలని, గత ప్రభుత్వం బకాయి పెట్టిన రైతుల సొమ్మును కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అభ్యుదయ రైతు వేళంగి శ్రీను, విజ్ఞప్తి చేశారు. తెలంగాణతో సమానంగా ఇక్కడ ధర పెరిగేలా కృషిచేస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి పామాయిల్ సాగు రైతులు తరఫున పుట్టా సోమన్నచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అధికారి పి.సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నతాధికారి పట్టాభిరామిరెడ్డి

పంట బీమా సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట మండలంలోని రైతులందరూ రబీ సీజన్ 2024-25 జీడిమామిడి పంటబీమాను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారిణి కె.దివ్యశ్రీ అన్నారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాతావరణ పరిస్థితుల వలన పంట నష్టం జరిగిన జీడిమామిడి రైతులకు అండగా నిలవాలని పంటబీమా పథకం అమలు చేస్తుందన్నారు. వాతావరణ ఆధారిత బీమా పథకంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు 1-11-2024 నుంచి 30-04-2025 కాలంలో పంట నష్టం కలుగుట అనగా వర్షపాతం ఎక్కువ, తక్కువ, అన్‌సీజనల్ వర్షపాతము, వర్షాలు పడిన, పడని రోజులు, , ఉష్ణోగ్రత అత్యధికం, అత్యల్పం,గాలిలో తేమ శాతం ఎక్కువ, తక్కువ ఉన్నట్లయితే, 3 సంవత్సరాలు దాటిన జీడిమామిడి పంట బీమా చేసేందుకు ఇఫ్కోటోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎంపిక చేసిందన్నారు. బీమా నమోదు చేసుందుకు ఒక ఎకరానికి 1500 రూపాయలు చెల్లించినట్లయితే 30000రూపాయల బీమా వర్తిస్తుందన్నారు. నవంబరు 15వ తేదీ లోపల బీమా చెల్లించాలన్నారు. బీమా పథకం వివరాలకు 9290033325 ఇఫ్‌కో జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రాజ్‌కుమార్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

కళాకారుడు ప్రసాదుల గురుమూర్తి ధన్యజీవి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, సీనియర్ సిటిజన్ ప్రజా సంక్షేమవేదిక ఆధ్వర్యంలో సిటిజన్ డేకేర్ భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్‌మాట్లాడుతూ ప్రసాదుల గురుమూర్తి ప్రజానాట్యమండలి కళాకారుడిగా ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దారని,సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణానికి కృషి చేశారని, అందువల్లనే భవనం పై భాగానికి ఆయన పేరును నామకరణం చేశామన్నారు. పంతం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు మాట్లాడుతూ గురుమూర్తి కళాసేవ అజరామరమని కొనియాడారు. సీహెచ్ స్టాలిన్,జానకిరామ్, జామిశెట్టి గాంధీ, సంజయ్, ప్రసాద్, బ్రహ్మానందం,జి.అప్పారావు, బి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై భద్రతా సూచనలు

బిక్కవోలు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు ఉన్నత పాఠశాలలో బుధవారం స్థానిక శివరామన్న ఇండియన్ గ్యాస్ కంపెనీ వారు విద్యార్థులకు గ్యాస్ వినియోగంపై భద్రతా సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వీరప్రభాకర రావు, గ్యాస్ కంపెనీ అధినేత తమలంపూడి చిన్నారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా జనార్దన స్వామి తెప్పోత్సవం

ధవళేశ్వరం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): నవజనార్ధన ఆలయాల్లో ప్రధానమైనది పురాణ ప్రసిద్ధిగాంచిన జనార్ధనగిరిపై ఉన్న శ్రీలక్ష్మీజనార్ధనస్వామి వారికి చిలక ద్వాదశి పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాన్ని కొండ పైనుంచి కిందకు తీసుకువచ్చి స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం రామపాదాల రేవు వద్ద స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు ఎస్‌వీవీఎస్‌ఎన్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. పూలదండలతో దీపాల అలంకరణతో అందంగా అలంకరించిన పంటుపై ఆశీనులైన స్వామి అమ్మవార్లు భక్తుల నామస్మరణ మధ్య గోదావరిలో విహరించారు. తెప్పోత్సవం అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధవళేశ్వరం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.





నేత్రపర్వంగా సత్యదేవుని నౌకా విహారం

కోరుకొండలో అంగరంగ వైభవంగా..

లక్ష్మీనరసింహుడి తెప్పోత్సవం





ఇది మన మంచి ప్రభుత్వం అంటున్నారు

బుధవారం అసెంబ్లీ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

గత ఐదేళ్లలో అరాచకాలు, విధ్వంసాలతో విసుగు చెందిన ప్రజలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పటి నుంచి ఇది మంచి ప్రభుత్వం అని ధైర్యంగా ఉన్నారు. అపార అనుభవజ్ఞుడైన చంద్రబాబు పాలనతో రాష్ట్రం ఇప్పుడు వికాసం వైపు అడుగులు వేస్తోంది. జగన్‌కు సంపద సృష్టించడం చేతకాక అంకెల గారడీ చేశాడు. డ్రగ్స్‌కు కేంద్ర బిందువుగా రాష్ట్రాన్ని మార్చేశాడని, యువత భవిష్యత్తుతో ఆడుకున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజలు సంతోషపడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లాను పర్యాటకపరంగా పూర్తిగా అభివృద్ధి చేయాలి.

- రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)



కొవ్వూరు ఏరియా ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసి సౌకర్యాలు కల్పించాలి

బుధవారం అసెంబ్లీ సమావేశంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి పూర్తిస్థాయి వైద్య సౌకర్యాలు కల్పించాలి. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గాల ప్రజలకు ఈ ఆసుపత్రి అందుబాటులో ఉంది. కొవిడ్ కేంద్రంగా పెట్టినప్పటికీ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. స్థానిక పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో కొంత వరకు వైద్యం అందిస్తున్నాము. పేరుకు ఏరియా ఆసుపత్రే అయినా వైద్యులు, సిబ్బంది, ల్యాబ్, లాబ్ టెక్నీషియన్ లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వాన్ని కోరగా ప్రతిపాదనలు పూర్తయ్యేసరికి ప్రభుత్వం మారింది. గత వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది.

- కొవ్వూరు (ఆంధ్రజ్యోతి)

- ఆవేదనలో విద్యా హక్కు చట్టం
- వెంటాడుతున్న ఆర్థిక దుస్థితి
- గత ప్రభుత్వంలో బడులు గజిబిజి
- జిల్లాలో 8వేల మంది చదువుకు దూరం
- ఒక్కరూ లేరంటున్న యంత్రాంగం



మగ్గుతున్న బాల్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బడిలో విద్యాబుద్ధులు నేర్వాల్సిన బాల్యం.. బడి బయట మగ్గిపోతోంది. రేపటి పౌరులు బలపానికి దూరమై వివిధ పనుల్లో బతుకీడుస్తున్నారు. ఈ పరిస్థితులు చూస్తూ బాలల హక్కులు, విద్యా హక్కు చట్టం ఆవేదన చెందుతోంది. విద్యా హక్కు చట్ట ప్రకారం 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు బడిలోనే ఉండాలి. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఇంట్లో ఆర్థిక పరిస్థితుల వల్ల పనులకు వెళ్లడం, బుద్ధి మాంధ్యం కలిగిన పిల్లలకు సరైన బోధనా ఏర్పాట్లు లేకపోవడం, పొట్ట చేత పట్టుకుని వలసలు వెళ్తున్న తల్లిదండ్రుల వెంట పిల్లలు దారితీయడం వంటి వివిధ కారణాలు బాలల విద్యపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తూ దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా పరిణమించాయి. నేటి బాలలు రేపటి పౌరులనే నెహ్రూ మాటలు చిన్నబోయి నేటి పిల్లలు రేపటి పనోళ్లు అనే విధంగా పరిస్థితులు పరిణమించాయి. అయితే జిల్లాలో బడి బయట ఒక్కరూ లేరని అధికారులు చెప్తున్నారు. కానీ సిగ్నల్ పాయింట్లు తదితర చోట్ల పిల్లలతో పాటు మహిళ యాచిస్తూ కనిపిస్తూ ఉంటుంది. కానీ ఆ పిల్లలు యంత్రాంగానికి మాత్రం కనిపించరెందుకనో!

వైసీపీ ప్రభుత్వంలో విద్యా విధానాన్ని అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. తీరూతెన్నూ లేకుండా రోజుకో మార్పు, పూటకో కొత్త సిలబస్ అనే మాదిరిగా పాలన సాగించారు. పాఠశాలలను మెర్జ్ చేయడం దగ్గర నుంచి చాక్‌పీస్‌లకూ డబ్బులు లేకుండా చేశారు. ఎంతసేపూ ప్రచార యావతో కూడిన గలాటాలో బడి మానేస్తున్న పిల్లల గురించి పట్టించుకోలేదు. దీంతో బడికి దూరమైన పిల్లల సంఖ్య ఎక్కువైపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్యలను చూసి నివ్వెరపోయింది. జిల్లాల వారీగా డ్రాపవుట్స్ (చదువు మానేసిన) పిల్లల సంఖ్యపై కసరత్తు చేసింది. ఈ లిస్టులో తూర్పు గోదావరి 11వ స్థానంలో ఉంది. గత నెల 15న విడుదల చేసిన వివరాల ప్రకారం జిల్లాలో 8,103 మంది ఉన్నట్లు తేల్చారు. ఈ జాబితాను జిల్లాకు పంపించి వెంటనే చర్యలకు ఉపక్రమించారు. క్లస్టర్ స్థాయిలో సీఆర్పీలను బడికి రాకుండా ఉన్న పిల్లల ఇళ్లకు పంపించి ఆరా తీస్తున్నారు.

● ఆర్థిక దుస్థితితో 30 మంది

ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్కరు కూడా బడి బయట ఉండకూడదంటూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో.. బడికి రాకుండా ఉన్న పిల్లల విషయంలో కారణాలపై అన్వేషణ మొదలుపెట్టారు. ఆ కారణాల్లో ఆర్థిక పరిస్థితులు అనుకూలించక 30 మంది విద్యకు దూరమైనట్లు గుర్తించడం ఆందోళనకు గురిచేస్తోంది. ఇల్లు గడవడం ఇబ్బందిగా ఉండడంతో ఆ పిల్లలు కార్మికులుగా పని చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే 15 మంది పిల్లలు రవాణా ఇబ్బందుల వల్ల చదువుకు స్వస్తి చెప్పేశారు. ఈ నెల 5వ తేదీ వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం 32 మంది పాఠశాల విద్య పూర్తి లేదా మధ్యలో మానేశారు. 78 మంది చనిపోయారు. 1211 మందికి వివరాలు పలుమార్లు నమోదయ్యాయి. 122 మంది రాష్ట్రంలోని వేరే ప్రాంతాలకు, 143 మంది ఇతర రాష్ట్రాలకు, ఐదుగురు విదేశాలకు వెళ్లారు. ఇద్దరు అనాధ పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారు. ఇతర కారణాల వల్ల 372 మంది బడికి రావట్లేదు. 287 మంది చాలా రోజుల నుంచి హాజరు కావట్లేదు. డేటా ఎంట్రీలో తప్పిదాలు 852 జరిగాయని గుర్తించారు. మొత్తానికి ఇంకా 3,207 మంది పిల్లల వివరాలు తేలాల్సి ఉంది.

● గజిబిజి ఇదేనా!

గతంలో స్టూడెంట్ ఇన్ఫో అనే పోర్టల్‌లో ప్రభుత్వ/ప్రైవేటు విద్యార్థుల వివరాలు కచ్చితంగా నమోదు చేసేవాళ్లు. తర్వాత యూడైస్ ప్లస్ అని తీసుకొచ్చారు. ముందు పోర్టల్‌లోని వివరాలు ఈ పోర్టల్‌లోకి బదిలీ కావడంలో ఇబ్బందులు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. అందువల్ల డ్రాపవుట్ విండోలో ఎక్కువ మంది పిల్లలను చూపిస్తోందని అంటున్నారు. కాగా ప్రైవేటు పాఠశాలలు సామర్థ్యానికి మించి విద్యార్థులను చేర్పించుకుంటాయనే విషయం బహిరంగ రహస్యమే. ఈ క్రమంలో వాస్తవాలు బయట పడతాయనే కారణంతో విద్యార్థుల వివరాలను స్టూడెంట్ ఇన్ఫో/యూడైస్‌లో నమోదు చేయకుండా సొంతంగా పరీక్షలు పెట్టేస్తూ తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రైవేటుకు వెళ్తున్న విద్యార్థుల విషయంలో గందరగోళం ఏర్పడి డ్రాపవుట్స్ సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని చెప్తున్నారు.

● మండలాల వారీగా

ఈ నెల 5వ తేదీకి క్రోడీకరించిన వివరాల ప్రకారం మండలాల వారీగా బడికి దూరంగా ఉన్న పిల్లల సంఖ్యలను చూస్తే... గోపాలపురం 7, తాళ్లపూడి 76, పెరవలి 88, సీతానగరం 69, ఉండ్రాజవరం 124, అనపర్తి 158, గోకవరం 134, దేవరాపల్లి 138, బిక్కవోలు 146, నిడదవోలు 37, రంగంపేట 102, కొవ్వూరు 181, రాజానగరం 199, కడియం 223, చాగల్లు 92, నల్లజర్ల 117, కోరుకొండ 327, రాజమహేంద్రవరం అర్బన్ 538, రాజమహేంద్రవరం రూరల్‌లో 451 మంది పిల్లలు బడి బయట ఉన్నారని రాష్ట్ర స్థాయి నివేదిక చెప్తోంది. ఈ మండలాల్లో అర్బన్, రూరల్ పరిధిలోనే 989 మంది పిల్లల పరిస్థితి తెలియాల్సి ఉండడం గమనార్హం.

● 9 నెలల్లో 12 మాత్రమే

బాలల సంరక్షణ, రక్షణ కోసం చైల్డ్ లైన్ పని చేస్తోంది. దీనికి దేశవ్యాప్తంగా 1098 టోల్‌ఫ్రీ ఫోన్ నెంబరు ఉంది. అయితే తమకు ఏదైనా ఫిర్యాదు వస్తేనే స్పందిస్తామనే ధోరణిలో చైల్డ్‌లైన్ సిబ్బంది ఉన్నారు. గడిచిన 9 నెలల్లో 12 కాల్స్ మాత్రమే రాగా వాటిలో బాలలు ఇద్దరు ఉన్నారు. ఏదేమైనా బాలలు బడికి దూరం కావడానికి రకరకాల కారణాలు కనిపిస్తున్నాయి. వీటిపై సహేతుకమైన కసరత్తు జరిగితేనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

వీళ్లెవరు మరి?

బాల కార్మికుల కోసం కార్మిక శాఖ విస్తృతంగా తనిఖీలు చేస్తోంది. గత రెండేళ్లలో 107 ప్రత్యేక సోదాలు చేసి 54 మంది బాల కార్మికులను అధికారులు గుర్తించారు. వీళ్లందరూ చదువుకు దూరంగా ఉన్నవాళ్లే. ఆర్థిక దౌర్బల్యం వల్ల దుకాణాలు, హోటళ్ల వంటిచోట పనులు చేస్తున్నారు. వారిని పనిలో పెట్టుకున్న వారిపై 54 కేసులు నమోదు చేయగా కోర్టు జరిమానా విధించింది. బడి బయట పిల్లలు ఎవరూ లేరని యంత్రాంగం ఎప్పుడూ చెప్పే మాటే.. అయితే వాళ్లందరూ ఎవరనే ప్రశ్నకే సమాధానం దొరకట్లేదు.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



లోకేశ్ సమక్షంలో నేడు టీడీపీలో చేరనున్న రాజీవ్ కృష్ణ

ముగ్గురు జడ్పీటీసీలు, ఒక ఎంపీపీ, పలువురు నేతలు కూడా

జిల్లాలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, వైసీపీ మాజీ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. రెండు రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసిన రాజీవ్‌కృష్ణ గురువారం ఉదయం అమరావతిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఆయనతో పాటు ముగ్గురు జడ్పీటీసీలు, ఒక ఎంపీపీ, పలువురు నేతలు టీడీపీలో చేరనున్నారు. వీరంతా ఇప్పటికే రాజధాని చేరుకున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ జిల్లా నేతలు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒకప్పుడు టీడీపీలో కింగ్ మేకర్‌గా వ్యవహరించి... 2012లో వైసీపీలో చేరిన ప్రముఖ పారిశ్రామికవేత్త పెండ్యాల కృష్ణబాబు అల్లుడు రాజీవ్‌కృష్ణ అనే సంగతి అందరికీ తెలిసిందే. పెద్ద పారిశ్రామికవేత్త అయినప్పటికీ సామాన్య కార్యకర్తలతో కూడా కలసిమెలసి ఉండే స్వభావం ఆయనది. 2014లో నిడదవోలు నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. కొద్దిరోజుల ముందే అభ్యర్థిత్వం ఖరారు కావడంతో పాటు అప్పటి టీడీపీ గాలిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. తర్వాత 12ఏళ్లగా కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో పార్టీకి వెన్నుదన్నుగా నిలబడ్డారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ సలహాదారుగా, అధికార ప్రతినిధిగా కూడా వ్యవహరించారు. పార్టీ శ్రేణులు, ద్వితీయ స్థాయి నేతల ఒత్తిడితో రాజీవ్‌కృష్ణ టీడీపీలో చేరడానికి నిర్ణయం తీసుకున్నారు. లోకేశ్‌తో మంతనాలు జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆయన్ను పార్టీలో చేరాలని చేరడానికి ఆహ్వానించినట్టు సమాచారం. రాజీవ్ కృష్ణతో పాటు కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు జడ్పీటీసీలు బొంత వెంకటలక్ష్మి, గారపాటి విజయదుర్గాశ్రీనివాస్, కొయ్యా సూరిబాబు, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, తాళ్లపూడి సర్పంచ్ నక్కా చిట్టిబాబు, దొమ్మేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు గారపాటి కృష్ణ, ధర్మవరం మాజీ సొసైటీ అధ్యక్షుడు ముళ్లపూడి కాశీవిశ్వనాథం, పశివేదల మాజీ ఉప సర్పంచ్ యలమాటి సత్యనారాయణ, వైసీపీ నేతలు నల్లా కిశోర్, చంద్రవరం వైసీపీ నేత బండి అశోక్‌బాబు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి కూడా టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

తాళ్లపూడి జడ్పీటీసీ పోసిన శ్రీలేఖ జడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా వున్నారు. ఆమె పార్టీ మారకపోవచ్చు కానీ పలువురు జడ్పీటీసీలు టీడీపీలో చేరడంతో పాటు ఇటీవల కొందరు జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ చైర్మన్ పదవికి కూడా ఇబ్బంది కలిగే పరిస్థితి ఏర్పడింది. నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి కూడా త్వరలో కొంతమంది రాజీవ్‌కృష్ణకు మద్దతుగా టీడీపీలో చేరతారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. రాజకీయంగా పట్టున్న కుటుంబానికి చెందిన నేత కావడం వల్ల రాజీవ్‌కృష్ణ చేరికతో టీడీపీకి బలం మరింత పెరిగినట్టేనని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

పేదల గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

వెలుగుబందలో గృహ నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి



రాజానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ గృహ నిర్మాణ పనులకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. రాజానగరం మండలం వెలుగుబంద కాలనీని ఆమె బుధవారం సందర్శించారు. సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో హౌసింగ్ నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, స్థితిగతులపై సమన్వయ శాఖాధికారులు, క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హౌసింగ్ కాలనీల్లో విద్యుత్, తాగునీటి సరఫరా, చెత్త సేకరణపై కార్యాచరణ అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హౌసింగ్ లే-అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో విద్యుత్ లైన్లు, రహదారుల అభివృద్ధి, తాగునీరు, అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ తదితర సదుపాయాలు కల్పించడం కోసం మూడు అంశాల ప్రాతిపదికన పనులు పూర్తి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గతంలో ప్రతిపాదించిన పనులను పూర్తి చేసేలా చర్యలతో పాటుగా కొత్తగా గుర్తించిన పనులకు ప్రతిపాదనలు పంపిండచం, మైనర్ పనులను సంబంధించి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. గతంలో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి వాటిని శాశ్వత కనెక్షన్‌గా మార్పు చేయాలని, విద్యుత్ లైన్లు క్రమబద్ధీకరించాలన్నారు. లే-అవుట్‌లో మరిన్ని ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, గ్రామ పంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న దృష్ట్యా పట్టణానికి చెందిన వారికి ఇళ్లు కేటాయించిన ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం, ఇతర నిర్వహణ విషయాల్లో చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ కేఎల్ శివజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బీవీ గిరి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ టి.తిలక్‌కుమార్, ఇన్‌చార్జి డీపీవో ఎం.నాగలత, గృహ నిర్మాణ సంస్థ క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తాడిపర్రులో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత... 8లో

బోట్స్‌మన్ రీచ్‌లన్నీ రాంకీ, ఆర్‌కేలకే!

- వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పింది వాళ్లే
- నామమాత్రంగా రెవెన్యూ ఉద్యోగులు
- ఇసుక రీచ్ వద్ద ఐదు యూనిట్ల లారీ రూ.12వేలు


గాయత్రి ర్యాంపు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విని యోగదారులకు ఇసుక అందని ద్రాక్ష మాదిరిగా ఉంది. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రీచ్‌ల్లోనూ ఇదే పరిస్థితి వుంది. టన్ను ఇసుక ధర రూ.229గా ప్రభుత్వం నిర్ణయిస్తే దానికి చాలా చోట్ల తూట్లుపొడుస్తున్నారు. ఐదు యూనిట్ల ఇసుక రూ.4,580 కాగా రూ.12వేలకు విక్రయిస్తున్నారు. అంటే టన్ను ఇసుక రూ.600 వసూలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని గాయత్రి రీచ్ వద్ద ఒక డ్రైవర్ నేరుగా కలెక్టర్‌కు చెప్పినట్టు తెలిసింది. ధరను ఎంత నియంత్రించినా వినియోగదారుని వద్దకు వెళ్లేసరికి రెట్టింపవుతోంది. ఈ రోజుకి కూడా సాధారణ ప్రజలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుక అందట్లేదంటే మాఫియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలి.

రాజమహేంద్రవరం రూరల్, సిటీ పరిధిలోని రీచ్‌లను ఇద్దరు వ్యక్తులకు గుత్తగా అప్పగించేశారు. బోట్స్‌మన్ సొసైటీలు ఇసుక తవ్వితే ప్రభుత్వమే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేసేది. గత ప్రభుత్వం జేపీ సంస్థకు అప్పగించడంతో సదరు సిబ్బంది రేవుల్లో విధులు నిర్వర్తించి సొసైటీలకు టన్నుకు రూ.200 ఇచ్చేవారు. దానిపై టన్నుకు రూ.430 అదనంగా కలిపి లారీ డ్రైవర్‌కి రూ.630కి విక్రయించేవారు. దానిపై రవాణా చార్జీతో వినియోగదారులకు విక్రయించేవారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పెట్టింది. ప్రజలే నేరుగా టన్ను రూ.229కి కొనుగోలు చేసుకుని దానిపై ట్రాన్స్‌పోర్టు చార్జీ చెల్లించి ఇంటికి ఇసుక తీసుకెళ్లే వెసులుబాటు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం మంచిదే. కానీ ఇసుక వ్యవహారంలో మారుతున్న సమీకరణలు సొసైటీలకు నష్టం చేకూర్చేలా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జేపీ సంస్థ ఇసుక వ్యాపారం చేసినప్పుడు వైసీపీ పెద్దరెడ్ల అనుచరులుగా, ఇన్‌చార్జిలుగా పనిచేసి న వారికే కొన్ని ర్యాంపులను కట్టబెట్టింది. వారే చక్రం తిప్పి వ్యాపారాలు చేశారు. వైసీపీ పెద్దలకు కోట్లాది రూపాయలు కూడబెట్టారు. అయితే ఇప్పుడు కూడా గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఆర్‌కే, రాంకీలకు అప్పగించి వారి ఆధీనంలో ఇసుక వ్యాపారం చెయ్యడం విమర్శలకు తావిస్తోంది. టన్ను ఇసుక రూ.229 అయితే అందులో ఈ వ్యక్తులు ఎంత తీసుకుంటారు. సొసైటీలకు ఎంత ఇస్తారు, అప్పుడు గిట్టుబాటు అవుతుందా, లేక పాత పద్ధతిలో బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక బోట్స్‌మన్ సొసైటీల ఇసుక రీచ్‌లను రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించలేక ప్రభుత్వాధికారులు చేతులేత్తేసారా అన్న అనుమానాలూ వున్నాయి.

ధవళేశ్వరంలోని గాయత్రి ఇసుక ర్యాంపును, వేమగిరి ఇసుక ర్యాంపును కలెక్టర్ ప్రశాంతి బుధవారం తనిఖీ చేశారు. అదనపు వసూళ్లపై ఆమెకు కొంతమంది లారీ డ్రైవర్లు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదులను రికార్డు చేయాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక సరఫరా అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. ఇసుక లోడింగ్ ఖర్చులను కూడా వినియోగదారులే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో హేతుబద్ధత కలిగి ఖర్చుల నిమిత్తం చెల్లింపులు జరపాలని సూచించారు. ఖర్చుల విషయంలో ఇష్టానుసారం నిర్ణయించరాదని స్పష్టం చేశారు.

అమ్మఒడి పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్‌తో మోసపోవద్దు

● పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల నుంచి వచ్చే మెస్సేజ్‌లకు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. అమ్మఒడి డబ్బులు పేరుతో సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలలో పడవద్దని హెచ్చరించారు. సైబర్ మోసగాళ్ల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

శెట్టిబలిజ సంఘ అభ్యున్నతి లక్ష్యంగా కార్యక్రమాలు

చాగల్లు, నవంబరు 13: ఉభయ తెలుగు రాష్ట్రాలలోని శెట్టిబలిజ సంఘీయుల అభ్యున్నతి లక్ష్యంగా ఈనెల 24వ తేదీన శెట్టిబలిజ వార్షిక వనసమారాధన, ఆత్మీయ సమ్మేళనం జరుగుతాయని ఆ సంఘ నాయకులు తెలిపారు. బుధవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ టీం, ఎస్ఏఎఫ్ పేరుతో సంఘ నాయకులు పలువురు చాగల్లు విచ్చేసి వనసమారాధన విజయవంతం చేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ఈకార్యక్రమంను విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు.

'వ్యవసాయేతర భూమిగా మార్చడానికి అనుమతి ఉండాలి'

గోపాలపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు వినియోగించుకునే ప్రతీఒక్కరూ వ్యవసా యేతర భూమిగా మార్చుకోవడానికి అనుమతి తప్పనిసరి అని ఆర్డీవో డాక్టర్ రాణిసుశ్మిత అన్నారు. మండలంలోని నందిగూడెం, గుడ్డిగూడెం గ్రామాల మధ్య వ్యవసాయేతర అనుమతులకు వచ్చిన ఆర్జీపై ఆమె బుధవారం భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిలో కట్టడాలు, తవ్వకాలు, ఇతర అవసరాలకు వినియోగించినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట తహసీల్దార్ విద్యాపతి, వీఆర్వో రాంబాబు, ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు

నిడదవోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న నేరాల గురించి వాటి నుంచి చట్టరీత్యా ఎలాంటి రక్షణ లభిస్తుందో చట్టాల అమలు తీరుపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీఐడీ అడిషినల్ ఎస్పీ అస్మ ఫర్హీన్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐడీ అడిషినల్ ఎస్పీ అస్మ ఫర్హీన్ మాట్లాడుతూ చట్టాలు సమాజ శ్రేయస్సు కోసమే అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులలో అరెస్టులు జరిగినప్పటికీ ట్రైల్స్ సమయంలో సాక్ష్యం సరిగా చెప్పకపోవడం వలన కేసులలో శిక్షలు పడడంలేదని అన్నారు. బాధితులు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగించేందుకే క్రైమ్ డిపార్ట్ మెంటు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నా మని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికార్లు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోతవరంలో కార్తీక వన సమారాధన

నల్లజర్ల, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం పోతవరం శివాలయంవద్ద బుధవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. 7 గ్రామాలకు సంబంధించిన భక్తులు అన్న సమారాధనకు హాజరయ్యారు. వేదపండితులు సూరిబాబు, నరసింహమూర్తి, ఉమామహేశ్వరరావు కలిసి తెల్లవారుజామున ఉమారామలింగేశ్వరాస్వామికి రుద్రాభిషేకం, దువదశ పూజలు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 5వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పాపా శ్రీనివాస్, ప్రత్తిపాటి అమ్మిరాజు, కమిటీ సభ్యులు మోతుక్కూరి శ్రీనివాస్, గద్దె నరసింహమూర్తి, నాయుడు కొండలరావు, మన్యం వెంకటేశ్వరరావు, డాక్టర్ సాయిబాబా, ఆరేటి బోస్, శివ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చాగల్లు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగల్లు, చంద్రవరం శాఖాగ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. చాగల్లు గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు, చంద్రవరం అధికారి కే సుమన్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం బాలల దినోత్సవ వేడుకలతో ప్రారంభమై శుక్రవారం పుస్తక పఠనం, శనివారం గ్రంథాలయ ఉద్యమ పితామహులను స్మరించుకోవడం, ఆదివారం కవి సమ్మేళనం, చదరంగం పోటీలు, నిర్వహిస్తారు. 19న మహిళ దినోత్సవం, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన వారోత్సవాలు ముగింపు కార్యక్రమాలు జరుగుతాయి. యువత, విద్యార్థిలోకం, సహా అందరిలోను పఠనాశక్తిని పెంపొందించడం లక్ష్యంగా వారోత్సవాలు జరుగుతాయని వారు తెలిపారు.

గోపాలపురం: నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు గ్రంథపాలకుడు వెజ్జు సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఏడురోజులపాటు జరిగే వారోత్సవాల్లో విద్యార్థులచే చదరంగం, వ్యాసరచన, వరకట్న నిర్మూలన, డ్రాయింగ్, క్విజ్‌పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

భారీ అన్నసమారాధన

చాగల్లు, నవంబరు 13 నెలటూరు శ్రీసత్యన్నారాయణస్వామి వారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఏకాహం భజన కార్యక్రమం జరిగింది. అనంతరం బుధవారం స్వామి వారి ఆలయంలో బారీ అన్నసమారాధన జరిగింది. గ్రాస్తులతో పాటు పరిశర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదం భుజించారు. ఆలయకమిటి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. నెలటూరు కోడూరివారి రా మాలయంలోను అన్నసమారాధన జరిగింది.

బాలల దినోత్సవ వేడుకలు

కొవ్వూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణ, మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ వీక్‌ను నిర్వహించారు. దానిలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను ఏర్పాటుచేశారు. బుదవారం కొవ్వూరు సద్గురు పాఠశాలలో నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్‌లో కృష్ణశ్రీహన్ బాల అంజనేయస్వామి వేషధారణలో అందరినీ అలరించాడు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సలహాదారుడు షరీఫ్‌ను కలిసిన గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా నియమితులైన శాసన మండలి మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత మహమ్మద్ షరీఫ్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అమరావతిలో షరీఫ్‌ను కలిసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

17న పుష్కరవనంలో బీసీ ఉద్యోగుల కార్తీక వనసమారాధన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ బీసీ/ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ద్వితీయ కార్తీక వనసమారాధన 2024ను ఈనెల 17న ఆదివారం రాజమహేంద్రవరం ఆటోనగర్ పుష్కర వనంలో నిర్వహిస్తున్నట్లు సంఘం తెలిపింది. సంఘం తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగులు పాల్గొని ఐక్యతను పటిష్టపరచాలని కోరారు.



తాడిపర్రులో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

● తాడిపర్రులో సంతాప సభ

ఉండ్రాజవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రు గ్రామంలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా విద్యుత్ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఏపీ, తెలంగాణా గౌడసంఘ నాయకులు తమ విచారం వ్యక్తం చేశారు. బుధవారం తాడిపర్రు గ్రామంలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహంవద్ద అమర వీరుల సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గౌడ సంఘ నాయకులు మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు గత 18నెలలుగా అటంకాలు ఏర్పడినా అధికారులతో జరిగిన చర్చల అనంతరం విగ్రహావిష్కరణ రోజున దురదృష్టవశాత్తు విద్యుత్‌షాక్ తగిలిన మారిశెట్టి మణికంఠ, బొల్లా వీర్రాజు, కాసగాని కృష్ణ, పామర్తి నాగేంద్రలు మరణించడం చాలా విచారకరమని వారు పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ రోజు వారు మరణం సంఘానికి తీరని లోటని వారు చెప్పారు. తొలుత మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ.2.75లక్షలు చొప్పున, గాయపడిన అనంతరావుకు రూ.1.50లక్షలు ఏపీ, తెలంగాణా గౌడ సంఘనాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జై గౌడసేన (తెలంగాణా)ఆంధ్రరాష్ట్ర గౌడ సంఘం, గీత బంధు సంఘం, కారంకి ఫౌండేషన్ నాయకులు, గౌడ సంఘ నాయకులు మోర్ల ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, స్థానిక సంఘ నాయకులు తాత కృష్ణారావు, మట్టా వీరబాబు, మారిశెట్టి సూరిపండు, వేముల సత్యనారాయణ, వెలిగట్ల వీరవెంకటరాజు, మారిశెట్టి చిన్నయ్య పాల్గొన్నారు.


తాడిపర్రులో సర్దార్‌పాపన్నగౌడ్ విగ్రహం వద్ద ఏపీ, తెలంగాణ గౌడసంఘ నాయకులు











నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సీతంపేట ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వతేది వరకు 57వ జాతయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు 14న నెహ్రూ జయంతితో కార్యక్రమాలు ప్రారంభిస్తారు. 15న పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. 16న గ్రంథాల ఉద్యమకారుల సంస్మరణ సభ, 17న రచయితల సందేశాలు, కవి సమ్మేళణం సెమినార్లు, నిర్వహిస్తారు. 18న విద్యార్థి దశలో గ్రంథాలయాల అవశ్యకత అనే అంశంపై సమీక్ష సమావేశం, 19న మహిళా దినోత్సవం, దిశ చట్టంపై అవగాహన, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన ర్యాలీ, ముగింపు ఉత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, డీఈవో , జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ మారిసెట్టి సత్యనారాయణ, ఎల్ఐసీ ఆఫీసర్ చెక్క తాతారావు, ప్రముఖ కవులు, వైద్యులు, సామాజిక సేవకులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

కళాకారుడు గురుమూర్తి ధన్యజీవి

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి,సీనియర్ సిటిజన్ ప్రజా సంక్షేమవేదిక ఆధ్వర్యంలో సిటిజన్ డేకేర్ భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్ మాట్లాడుతూ,ప్రసాదుల గురుమూర్తి ప్రజానాట్యమండలి కళాకారుడిగా ఎంతో మంది కళాకారుల్ని తీర్చిదిద్దారని,సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణానికి కృషి చేశారని, భవనంపై బాగానికి ఆయన పేరును నామకరణం చేశామన్నారు. పంతం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు మాట్లాడుతూ గురుమూర్తి కళాసేవ అజరామరమని కొనియాడారు.



